RNI No: TELTEL/2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | ఆదివారం | పేజీలు 8
సంపుటి: 4 సంచిక:141 | మే 31, 2026 | వెల: రూ.3-00

లింగబత్తిని కృష్ణ
సీఎండీ & ఎడిటర్
9701923260



2లో

## సిందూర్ 2.0కు సిద్ధం

భారత సైన్యాధిపతి జనరల్ ఉపేంద్ర ద్వివేది

# రాష్ట్ర కాంగ్రెస్‌లో కర్ణాటక కలలు!

## పొరుగు రాష్ట్రంలో సీఎం మార్పు.. రాష్ట్ర నేతల్లో మొదలైన ఆశలు



- రేవంత్ రెడ్డిని గద్దె దించాలని ఆశపడుతున్న కొందరు సీనియర్లు
- క్షేత్రస్థాయి వాస్తవాలతో నిట్టూర్పులు
- ముఖ్యమంత్రి తీరుపై అంతర్గతంగా గుర్రు
- అయినా లోలోపలే మదనపాటు
- రాజగోపాల్ రెడ్డి మినహా ఎవరూ ఎదిరించే సాహసం చేయలేని పరిస్థితి
- అక్కడి గెలుపులో ఇద్దరి చరిష్మా.. సీఎం సీటుపై ముందే ఒప్పందం..
- రాష్ట్రంలో ఒంటిచేత్తో పార్టీని గెలిపించిన క్రేజ్ రేవంత్ సొంతం
- కలలకే పరిమితమవుతున్న సీనియర్ల ఆలోచన

2లో

**వేద న్యూస్, పొలిటికల్ బ్యూరో**

పొరుగు రాష్ట్రం కర్ణాటకలో కాంగ్రెస్ హైకమాండ్ ముఖ్యమంత్రి మార్పు నిర్ణయం తీసుకోవడం తెలంగాణ కాంగ్రెస్ రాజకీయాల్లోనూ కొత్త చర్చకు తెరలేపింది. సిద్ధరామయ్య స్థానంలో డీకే శివకుమార్‌కు సీఎం బాధ్యతలు అప్పగించనుండడంతో, తెలంగాణలోని కొందరు సీనియర్ నేతలు కూడా ఇలాంటి రాజకీయ పరిణామాలు ఇక్కడ చోటు చేసుకుంటాయా అనే ఆశతో ఎదురుచూస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వ శైలిపై అసంతృప్తితో ఉన్న వర్గాలు ఈ పరిణామాలను ఆసక్తిగా గమనిస్తున్నప్పటికీ, తెలంగాణలోని రాజకీయ వాస్తవాలు కర్ణాటకకు పూర్తి భిన్నంగా ఉండటంతో నాయకత్వ మార్పు అంత సులభం కాదనే అభిప్రాయం బలంగా వినిపిస్తోంది. ఒకవైపు సీఎం పదవిపై కొందరి ఆశలు, మరోవైపు రేవంత్ రెడ్డికి ఉన్న ప్రజాదరణ, అధిష్ఠానం విశ్వాసం నేపథ్యంలో కాంగ్రెస్‌లో అంతర్గత చర్చలు మళ్లీ తెరపైకి వచ్చాయి. ప్రస్తుతం రాష్ట్ర కాంగ్రెస్‌లో కనిపిస్తున్న ఈ అంతర్గత రాజకీయ సమీకరణాలు భవిష్యత్తులో ఎలాంటి మలుపులు తిరుగుతాయన్నది ఆసక్తికరంగా మారింది.

# వచ్చేది బీఆర్ఎస్ సర్కారే



- కాంగ్రెస్‌ను బొంద పెట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు
- జీవో-17ను వెంటనే రద్దు చేయాలి
- బడుగు వర్గాల కాంట్రాక్టర్లకు అన్యాయం జరుగుతోంది
- ప్రభుత్వ కాంట్రాక్టులపై శ్వేతపత్రం విడుదల చేయాలి
- కాంగ్రెస్ హామీలు అమలు కాలేదు
- అవసరమైతే ఢిల్లీ వరకు ఉద్యమం చేస్తాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**వేద న్యూస్, హైదరాబాద్**

ఇందిరాపార్క్ వద్ద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహాధర్నాలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అన్ని వర్గాలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు. చేవెళ్ల, కామారెడ్డి డిక్లరేషన్లలో ఎస్సీలకు 18 శాతం, ఎస్టీలకు 12 శాతం, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ప్రభుత్వ కాంట్రాక్టుల్లో కల్పిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత

మిగతా 2వ పేజీలో

# ఉదయాన్నే ఆవిర్భావ వేడుకలు



- ఎనిమిదిన్నరకే ఉత్సవాలు ప్రారంభం
- ఎండలతో సమయం మార్పు
- అతిథులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు

**వేద న్యూస్, హైదరాబాద్**

తెలంగాణ రాష్ట్రంలో కొనసాగుతున్న మండుటెండల నేపథ్యంలో రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఉదయం పూట నిర్వహించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రజలు, అతిథులు ఎండల కారణంగా ఇబ్బందులు

మిగతా 2వ పేజీలో

# మీటర్లు పెడితే ఉరే దిక్కు!

- ఉరితాళ్లతో రైతుల నిరసన
- మోటార్లకు మీటర్లపై ఆందోళన
- కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు



2లో

# ప్రజాసేవలో పోలీసులు ముందుండాలి

- నిబద్ధతతో విధులు నిర్వహించాలి
- శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి
- వీసీలో డీజీపీ సీవీ ఆనంద్ సూచనలు

2లో




# వడ్డీ జలగలు!

- గద్వాల్ జిల్లాలో యథేచ్ఛగా ప్రైవేట్ ఫైనాన్స్ దందా
- అధిక వడ్డీలతో అప్పుల ఊబిలోకి కుటుంబాలు

5లో

## రూ.9 లక్షల లంచం..

# మొదటి విడతగా రూ.5 లక్షలు!

- ఏసీబీ వలలో సైబర్ ఇన్‌స్పెక్టర్ మహేందర్
- తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరోలో కలకలం
- అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు
- లంచాలు డిమాండ్ చేస్తే వెంటనే ఫిర్యాదు చేయాలి: ఏసీబీ



2లో




# తెలంగాణకు రెడ్ అలర్ట్

- పలు జిల్లాల్లో వడగాల్పుల ముప్పు
- కొన్ని జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు
- నాలుగు రోజుల పాటు వర్షాలు పడే అవకాశం

2లో

## మీటర్లు పెడితే ఉరే దిక్కు!

**వేద న్యూస్, ముఖరా(కే)**

వ్యవసాయ మోటార్లకు విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేసే అవకాశాలపై ఆందోళన వ్యక్తం చేస్తూ ముఖరా(కే) గ్రామ రైతులు వినూత్న నిరసన చేపట్టారు. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద చేతుల్లో ఉరితాళ్లు పట్టుకొని నిరసన వ్యక్తం చేసిన రైతులు, మోటార్లకు మీటర్లు అమర్చితే రైతుల జీవితాలు మరింత కష్టాల్లో పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో రైతులకు ఇరవై నాలుగు గంటల ఉచిత విద్యుత్ అందించడంతో వ్యవసాయ రంగానికి ఎంతో మేలు జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం మోటార్లకు మీటర్లు ఏర్పాటు చేయాలని ఒత్తిడి చేసినప్పటికీ అప్పటి ప్రభుత్వం రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఆ నిర్ణయాన్ని అమలు చేయలేదని పేర్కొన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో కలిసి వ్యవసాయ మోటార్లకు మీటర్లు ఏర్పాటు చేసే దిశగా అడుగులు వేస్తోందనే అనుమానం తమకు కలుగుతోందని రైతులు ఆరోపించారు. మీటర్లు అమలు చేస్తే విద్యుత్ చార్జీల భారం పెరిగి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి వస్తుందని తెలిపారు. రాష్ట్రంలో రైతులు ఇప్పటికే అనేక సమస్యలతో సతమతమవుతున్నారని నిరసనకారులు పేర్కొన్నారు. రుణమాఫీ పూర్తిస్థాయిలో అమలు కాలేదని, రైతు భరోసా పథకం ప్రయోజనాలు అందరికీ చేరడం లేదని, పండించిన పంటలను సకాలంలో కొనుగోలు చేయడం లేదని ఆరోపించారు. ఈ పరిస్థితుల్లో మోటార్లకు మీటర్లు అమలు చేస్తే రైతులపై మరింత భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ రంగాన్ని రక్షించాలంటే ఉచిత విద్యుత్ విధానాన్ని కొనసాగించాలని రైతులు డిమాండ్ చేశారు. రైతుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా ఎలాంటి నిర్ణయాలు తీసుకోవద్దని ప్రభుత్వాన్ని కోరారు. వ్యవసాయ రంగానికి నష్టం కలిగించే చర్యలను విరమించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గాడ్గే మీనాక్షి, మాజీ ఎంపీటీసీ గాడ్గే సుభాష్, దత్త, మారోతి, ప్రహ్లాద్, వెంకటి, తులసిరామ్, తిరుపతి, విఠల్‌తో పాటు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు. రైతుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

## వచ్చేది బీఆర్ఎస్ సర్కారే

**మొదటి పేజీ తరువాయి**

వాటిని అమలు చేయలేదని విమర్శించారు. బడుగు, బలహీన వర్గాల ఆర్థిక అభివృద్ధికి తోడ్పడాల్సిన ప్రభుత్వం వారిని నిర్లక్ష్యం చేస్తోందని అన్నారు. గురుకుల పాఠశాలలకు అవసరమైన సరఫరాల టెండర్లను స్థానిక చిన్న కాంట్రాక్టర్లకు దూరం చేసేలా జీవో నంబర్–17 తీసుకొచ్చారని ఆరోపించిన కేటీఆర్, ఆ జీవోను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. చిన్న కాంట్రాక్టర్ల జీవనోపాధిపై ఈ నిర్ణయం తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ కాంట్రాక్టులు కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతమవుతున్నాయని ఆరోపించిన ఆయన, ప్రభుత్వం చేసిన అప్పులు, కాంట్రాక్టుల కేటాయింపులు, చెల్లింపులపై వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన కాళేశ్వరం, రైతుబంధు, కల్యాణలక్ష్మి , కేసీఆర్ కిట్, 24 గంటల ఉచిత విద్యుత్ వంటి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రస్తావించిన కేటీఆర్, బడుగు వర్గాల అభ్యున్నతే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో రైతులు, నిరుద్యోగులు, చిన్న వ్యాపారులు, కాంట్రాక్టర్లు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని పేర్కొన్న ఆయన, ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకతతో ఉన్నారని వ్యాఖ్యానించారు. బడుగు వర్గాల సమస్యలపై పోరాటం మరింత ఉధృతం చేస్తామని, అవసరమైతే ఢిల్లీ వరకు ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. 2028లో మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేసిన కేటీఆర్, బడుగు, బలహీన వర్గాలకు చెందిన యువతను పెద్ద ఎత్తున కాంట్రాక్టర్లుగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడతామని హామీ ఇచ్చారు. బడుగు వర్గాల హక్కులు, సంక్షేమం కోసం బీఆర్ఎస్ ఎల్లప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు.

## ఉదయాన్నే ఆవిర్భావ వేడుకలు

**మొదటి పేజీ తరువాయి**

పడకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. జూన్ 2న హైదరాబాద్‌లోని పేరేడ్ గ్రౌండ్స్ లో నిర్వహించనున్న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఉదయం 8.30 గంటలకు ప్రారంభించేలా ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. కార్యక్రమం సమయాన్ని కుదించి సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. జాతీయ పతాకావిష్కరణతో పాటు అవతరణ దినోత్సవానికి సంబంధించిన అన్ని కార్యక్రమాలను గంటన్నర వ్యవధిలో పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమాల నిర్వహణలో ఎలాంటి జాప్యం లేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. వేడుకలకు హాజరయ్యే ప్రజాప్రతినిధులు, అధికారులు, ఆహ్వానితులు, సాధారణ ప్రజలకు తగిన సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. తాగునీరు, వైద్య సదుపాయాలు, నీడ ఏర్పాట్లు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. స్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రజల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యం ఇవ్వడం కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండే మధ్యాహ్న వేళల్లో కార్యక్రమాలు నిర్వహించకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించడంతో పాటు ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

## సిందూర్ 2.0కు సిద్ధం

### భారత సైన్యాధిపతి జనరల్ ఉపేంద్ర ద్వివేది

**వేద న్యూస్, నేషనల్ బ్యూరో**

దేశ భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, అవసరమైతే ఆపరేషన్ సిందూర్ 2.0 చేపట్టేందుకు త్రివిధ దళాలు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉన్నాయని భారత సైన్యాధిపతి జనరల్ ఉపేంద్ర ద్వివేది శనివారం కీలక వ్యాఖ్యలు చేశారు. సరిహద్దు ప్రాంతాల్లో ప్రస్తుతం నెలకొన్న ప్రశాంతతను శాశ్వత పరిస్థితిగా భావించరాదని, అది కేవలం తాత్కాలికమే కావచ్చని హెచ్చరించారు. దేశ భద్రతకు సంబంధించిన ప్రతి అంశాన్ని సైన్యం నిశితంగా పరిశీలిస్తోందని జనరల్ ద్వివేది తెలిపారు. శత్రు దేశాల కదలికలపై నిరంతరం నిఘా కొనసాగుతోందని, ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సైనిక దళాలు సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. సరిహద్దు ప్రాంతాల్లో భద్రతా వ్యవస్థను మరింత బలోపేతం చేసినట్లు వెల్లడించారు. ఆధునిక యుద్ధ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని త్రివిధ దళాల మధ్య సమన్వయాన్ని మరింత పెంచుతున్నామని ఆయన తెలిపారు. భూసేన, నౌకాదళం, వైమానిక దళం మధ్య సమాచార మార్పిడి, వ్యూహాత్మక సహకారం పటిష్ఠంగా కొనసాగుతోందన్నారు. యుద్ధరంగంలో ప్రతి కదలికను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. సైనికుల భద్రతతో పాటు పౌరుల రక్షణ కూడా తమకు అత్యంత ప్రాధాన్యమని జనరల్ ద్వివేది స్పష్టం చేశారు. ఎలాంటి అత్యవసర పరిస్థితులు తలెత్తినా వెంటనే స్పందించేలా అన్ని రక్షణ దళాలు ఇరవై నాలుగు గంటలూ అప్రమత్తంగా పనిచేస్తున్నాయని తెలిపారు. దేశ రక్షణ విషయంలో ఎల్లప్పుడూ అత్యున్నత స్థాయి సన్నద్ధత కొనసాగుతోందన్నారు.

# రాష్ట్ర కాంగ్రెస్‌లో కర్ణాటక కలలు!

### పొరుగు రాష్ట్రంలో సీఎం మార్పు.. రాష్ట్ర నేతల్లో మొదలైన ఆశలు

- రేవంత్ రెడ్డిని గద్దె దించాలని కొందరు సీనియర్ల డ్రీమ్స్
- క్షేత్రస్థాయి వాస్తవాలతో నిట్టూర్పులు
- ముఖ్యమంత్రి తీరుపై అంతర్గతంగా గుర్రు
- అయినా లోలోపలే మదనపాటు
- రాజగోపాల్ రెడ్డి మినహా ఎవరూ ఎదిరించే సాహసం చేయలేని పరిస్థితి
- అక్కడి గెలుపులో ఇద్దరి చరిష్మా.. ముందే ఒప్పందం?
- రాష్ట్రంలో ఒంటిచేత్తో పార్టీని గెలిపించిన క్రేజ్ రేవంత్ సొంతం
- కలలకే పరిమితమవుతున్న సీనియర్ల ఆలోచన



**వేద న్యూస్, పొలిటికల్ బ్యూరో**

పొరుగు రాష్ట్రం కర్ణాటక కాంగ్రెస్‌లో రెండున్నరేళ్ల ఒప్పందం ప్రకారం ముఖ్యమంత్రి పీఠం మార్పిడి జరగడం.. ఇప్పుడు తెలంగాణ కాంగ్రెస్‌లో కొత్త ప్రకంపనలు సృష్టిస్తోంది. అక్కడ సిద్దరామయ్యను సీఎం పీఠం నుంచి దించి, డీకే శివకుమార్‌కు హైకమాండ్ ముఖ్యమంత్రి పగ్గాలు అప్పగించడంతో.. రాష్ట్ర కాంగ్రెస్‌లోని కొందరు సీనియర్ లీడర్లలో సరికొత్త ఆశలు చిగురించాయి. మన దగ్గర కూడా ముఖ్యమంత్రి మార్పిడి జరిగితే ఎంత బాగుండునో! అని కొందరు సీనియర్లు, రేవంత్ వ్యతిరేక వర్గం అంతర్గతంగా కలలు కంటున్నట్లు కాంగ్రెస్ వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది. అయితే, కర్ణాటకలో ఉన్న రాజకీయ పరిస్థితులు, ఇక్కడి వాస్తవాలు పూర్తిగా వేరని గ్రహిస్తున్న సదరు నేతలు.. తమకు తామే లోలోపల నిట్టూరుస్తున్నారనే టాక్ నడుస్తోంది.

**రేవంత్ తీరుపై కొందరి గుర్రు..**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పదవీ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచే పార్టీలోని ఒక వర్గం ఆయన శైలిని జీర్ణించుకోలేకపోతోంది. రేవంత్ రెడ్డి తీసుకునే ఏకపక్ష నిర్ణయాలు, ఒంటెద్దు పోకడలపై ఇప్పటికే కొందరు సీనియర్లు తీవ్ర గుర్రుగా ఉన్నారు. నేరుగా ముఖ్యమంత్రిని ఎదిరించే సాహసం చేయకపోయినా.. అడపాదడపా ఢిల్లీకి వెళ్లి అధిష్ఠానం పెద్దలకు ఫిర్యాదులు చేస్తూనే ఉన్నారు. ఇప్పుడు కర్ణాటక ఎఫెక్ట్‌తో ఈ అసంతృప్త వర్గం మరింత యాక్టివ్ అయ్యింది. విచిత్రమేమిటంటే.. ఇన్నాళ్లూ రేవంత్ రెడ్డికి అత్యంత సన్నిహితంగా, ఆయన వెన్నంటే ఉంటున్న కొందరు కీలక నేతల్లోనూ.. ఒకవేళ లీడర్‌షిప్ మారితే తమకు కూడా లక్ చిక్కుతుందేమోననే రహస్య ఆశలు మొలకెత్తడం పార్టీ ఇన్‌సైడ్ పాలిటిక్స్‌ను హీటెక్కిస్తోంది.

**ఒంటిచేత్తో గెలిపించిన రేవంత్**

నిజానికి కర్ణాటక పరిస్థితులు వేరు.. తెలంగాణ పరిస్థితులు పూర్తిగా వేరు. కర్ణాటక ఎన్నికల్లో సిద్ధరామయ్య ప్రజాకర్షణతో పాటు.. డీకే శివకుమార్ అంగబలం, అర్థబలం, పార్టీని నడిపించిన చరిష్మా కాంగ్రెస్‌ను గెలిపించాయి. అందుకే అక్కడ ఇద్దరి వాటా సమానంగా ఉంది. కానీ తెలంగాణలో మాత్రం కాంగ్రెస్ పార్టీని పూర్తిగా ఒంటిచేత్తో అధికారంలోకి తీసుకువచ్చింది రేవంత్ రెడ్డి మాత్రమేనన్నే బలమైన ముద్ర ఢిల్లీ అధిష్ఠానం వద్ద ఉంది. రేవంత్ రెడ్డికి ఉన్న మాస్ ఇమేజ్, ప్రజలను ఆకట్టుకునే అద్భుతమైన వాక్పటిమ, ప్రత్యర్థులను మాటలతో చీల్చిచెండాడే ధాటి.. ప్రస్తుత రాష్ట్ర కాంగ్రెస్‌లో ఏ ఒక్క సీనియర్ నాయకుడికీ లేవనేది హైకమాండ్ నమ్మకం.

**కలలు కనడమే.. వాస్తవాలు వేరు!**

ఈ క్షేత్రస్థాయి విశ్లేషణలన్నీ అసంతృప్త నేతలకు కూడా బాగా తెలుసు. రేవంత్ రెడ్డి లాంటి పవర్‌ఫుల్ మాస్ లీడర్‌ను అంత సులభంగా సీఎం కుర్చీ నుండి కదిలించడం సాధ్యం కాదని, అధిష్ఠానం కూడా అందుకు ఒప్పుకోదని వారికి స్పష్టత ఉంది. అందుకే 'కర్ణాటక కలలు' కంటున్నప్పటికీ.. ఇక్కడి రాజకీయ పరిస్థితులు తమకు అనుకూలంగా లేవని తెలుసుకుని, సీనియర్లంతా లోలోపల నిట్టూరుస్తూ కాలం గడుపుతున్నారు. ఏది ఏమైనప్పటికీ.. పొరుగు రాష్ట్రంలో జరిగిన సీఎం మార్పు, తెలంగాణ కాంగ్రెస్ లీడర్ల మనసుల్లోని అసలైన కోరికలను, అంతర్గత వర్గపోరును మరోసారి బహిర్గతం చేసిందని చెప్పక తప్పదు.

### రేవంత్‌కు దీటైన నాయకులు ఏరి?

కర్ణాటకలో సిద్ధరామయ్యను మార్చాలంటూ డీకే శివకుమార్ తన వర్గంతో గట్టిగా పట్టుబట్టగలిగారు. కానీ తెలంగాణ కాంగ్రెస్‌లో రేవంత్ రెడ్డిని నేరుగా ఢీకొట్టే అంత సీన్ ఉన్న నాయకుడు ఒక్కరైనా ఉన్నారా? అనేదే పెద్ద ప్రశ్న. ఇప్పటివరకు మంత్రివర్గంలో కానీ, పార్టీలో కానీ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మినహా నేరుగా ముఖ్యమంత్రిని ఎదిరించి మాట్లాడిన వారే లేరు. మిగిలిన సీనియర్లంతా రేవంత్ రెడ్డి వ్యూహాల ముందు సైలెంట్ అయిపోయారు. రేవంత్ రెడ్డిని గద్దె దించాలనే కోరిక ఉన్నప్పటికీ.. ఆయనకు దీటైన ప్రత్యామ్నాయ చరిష్మా ఉన్న లీడర్ ప్రస్తుతం తెలంగాణ కాంగ్రెస్‌లో కనిపించకపోవడం అసంతృప్తులకు పెద్ద మైనస్‌గా మారింది.

## రూ.9 లక్షల లంచం డిమాండ్..
## మొదటి విడతగా రూ.5 లక్షలు!

- ఏసీబీ వలలో సైబర్ ఇన్‌స్పెక్టర్ మహేందర్
- తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరోలో కలకలం
- అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు
- లంచాలు డిమాండ్ చేస్తే వెంటనే ఫిర్యాదు చేయాలి: ఏసీబీ



**వేద న్యూస్, హైదరాబాద్**

తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరోలో విధులు నిర్వహిస్తున్న సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బత్తుల మహేందర్ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) వలలో చిక్కిన ఘటన సంచలనం రేపింది. ఓ కేసుకు సంబంధించిన అంశంలో సహకారం అందించేందుకు ఫిర్యాదుదారుడి నుంచి రూ.9 లక్షల లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఏసీబీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, ఫిర్యాదుదారుడి సమాచారంతో ముందస్తు ప్రణాళిక రూపొందించి ఉచ్చుపన్నారు. ఈ క్రమంలో మొదటి విడతగా రూ.5 లక్షలు స్వీకరిస్తున్న సమయంలో ఇన్‌స్పెక్టర్ మహేందర్‌ను ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. లంచం నగదు స్వీకరిస్తున్న సమయంలో అధికారులు సాక్ష్యాధారాలతో సహా పట్టుకున్నట్లు సమాచారం. ఈ ఘటనతో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరోలో కలకలం రేగింది. నిందితుడిపై అవినీతి నిరోధక చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలుస్తోంది. స్వాధీనం చేసుకున్న నగదుతో పాటు ఇతర ఆధారాలను సేకరిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా లంచాలు డిమాండ్ చేసినట్లయితే ప్రజలు వెంటనే ఏసీబీని సంప్రదించాలని అధికారులు సూచించారు. అవినీతి నిర్మూలనలో ప్రజల సహకారం ఎంతో కీలకమని పేర్కొన్నారు.

## ప్రజాసేవలో పోలీసులు ముందుండాలి

**వేద న్యూస్, హైదరాబాద్**

రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజలకు మరింత మెరుగైన పోలీసు సేవలు అందించడంలో ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది నిబద్ధతతో పనిచేయాలని తెలంగాణ డీజీపీ సి.వి. ఆనంద్ సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పోలీసు అధికారులకు పలు కీలక దిశానిర్దేశాలు చేశారు. ప్రజల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలని, చట్టవ్యవస్థ పరిరక్షణలో ఎలాంటి రాజీ పడకూడదని డీజీపీ స్పష్టం చేశారు. నేరాల నియంత్రణ, శాంతిభద్రతల నిర్వహణ, ప్రజా సమస్యల పరిష్కారంలో పోలీసులు మరింత చురుకుగా వ్యవహరించాలని సూచించారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే ప్రతి ఫిర్యాదును బాధ్యతాయుతంగా స్వీకరించి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజల్లో పోలీసు వ్యవస్థపై విశ్వాసాన్ని పెంపొందించేలా సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ నేరాల నియంత్రణను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని డీజీపీ సూచించారు. సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, ఇతర నేర కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా కొనసాగించాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో నితికా పంత్, అఖిల్ మహాజన్ పాల్గొన్నారు. జిల్లాల్లో అమలు చేస్తున్న భద్రతా చర్యలు, నేర నియంత్రణ కార్యక్రమాలపై వారు వివరాలు అందించారు. ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ పారదర్శకమైన పోలీసింగ్ అందించాలన్నదే రాష్ట్ర పోలీసు శాఖ లక్ష్యమని డీజీపీ సి.వి. ఆనంద్ పేర్కొన్నారు.

## తెలంగాణకు రెడ్ అలర్ట్

**వేద న్యూస్, హైదరాబాద్**

తెలంగాణ రాష్ట్రంలో ఎండల తీవ్రత మరోసారి పెరగనున్న నేపథ్యంలో హైదరాబాద్ వాతావరణ కేంద్రం పలు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. ముఖ్యంగా దక్షిణ, తూర్పు తెలంగాణ ప్రాంతాల్లో తీవ్రమైన వడగాల్పులు వీచే అవకాశం ఉందని హెచ్చరించింది. ప్రజలు అత్యవసరమైతే తప్ప మధ్యాహ్న సమయంలో బయటకు రావద్దని సూచించింది. చిన్నారులు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపింది. ఈరోజు మహబూబాబాద్, ఖమ్మం, సూర్యాపేట, నల్గొండ జిల్లాల్లో వడగాల్పుల ప్రభావం అత్యధికంగా ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ జిల్లాల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదయ్యే అవకాశముందని పేర్కొంది. వేడిగాలుల ప్రభావంతో ప్రజలు అసౌకర్యానికి గురయ్యే పరిస్థితులు ఉండవచ్చని హెచ్చరించింది. అదే సమయంలో గంటకు నలభై నుంచి యాభై కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఉరుములు, మెరుపులతో కూడిన వాతావరణ పరిస్థితులు కొన్ని ప్రాంతాల్లో ఏర్పడవచ్చని పేర్కొన్నారు. రైతులు, నిర్మాణ రంగ కార్మికులు, బహిరంగ ప్రదేశాల్లో పనిచేసే వారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉమ్మడి కరీంనగర్, వరంగల్, ఆదిలాబాద్ జిల్లాలతో పాటు సిద్దిపేట, నిజామాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేశారు. ఈ ప్రాంతాల్లో వడగాల్పుల తీవ్రత కొంత మేర అధికంగా ఉండటంతో ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. తగినంత నీరు తాగడం, తేలికపాటి ఆహారం తీసుకోవడం, ఎండలో ఎక్కువసేపు గడపకుండా ఉండడం మంచిదని తెలిపారు. క్యుములోనింబస్ మేఘాల ప్రభావంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. ముఖ్యంగా ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాల్లో ఈరోజు వర్షాలు నమోదయ్యే అవకాశాలు ఉన్నట్లు వెల్లడించింది. కొన్ని చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు పడే అవకాశం ఉందని పేర్కొంది. నేటి నుంచి వచ్చే నాలుగు రోజుల పాటు తెలంగాణలోని అనేక ప్రాంతాల్లో తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని అధికారులు తెలిపారు. ఒకవైపు వడగాల్పులు, మరోవైపు ఈదురు గాలులు, వర్షాలు నమోదయ్యే పరిస్థితులు ఉండటంతో ప్రజలు వాతావరణ పరిస్థితులపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రైతులు కూడా తాజా వాతావరణ హెచ్చరికలను అనుసరిస్తూ వ్యవసాయ పనులు చేపట్టాలని వాతావరణ శాఖ సూచించింది.

వేద న్యూస్

ఆదివారం మే 31 , 2026

# అంతర్రాష్ట్ర దొంగల ముఠాపై అలర్ట్

- పెద్దపల్లి జిల్లాలోకి ప్రవేశించిన ఇద్దరు అనుమానితులు
- అప్రమత్తంగా ఉండాలని ఎస్సై ప్రవీణ్ కుమార్ హెచ్చరిక

**వేద న్యూస్, ధర్మారం:**



పెద్దపల్లి జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ధర్మారం ఎస్సై ఎం. ప్రవీణ్ కుమార్ సూచించారు. ఢిల్లీకి చెందిన అంతర్రాష్ట్ర దోపిడీ ముఠాలోని ఇద్దరు సభ్యులు పెద్దపల్లి ప్రాంతంలోకి ప్రవేశించినట్లు పోలీసులకు సమాచారం అందినట్లు తెలిపారు. ఈ ముఠా సభ్యులు పెద్దపల్లి పట్టణంతో పాటు పరిసర గ్రామాల్లో సంచరిస్తూ, ఒంటరిగా ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి, తమ ప్రాంతాల్లో కొత్త వ్యక్తులు లేదా అనుమానాస్పదంగా తిరిగేవారిపై నిఘా ఉంచాలని సూచించారు. ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే ధర్మారం పోలీస్ స్టేషన్ నంబర్ 8712656508 లేదా అత్యవసర సేవల నంబర్ 100కు సమాచారం అందించాలని ఎస్సై కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు.

# జూలపల్లిలో మంత్రి శ్రీధర్ బాబు జన్మదిన వేడుకలు

- కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్న కాంగ్రెస్ నాయకులు

**వేద న్యూస్, జూలపల్లి:**



జూలపల్లి మండల కేంద్రంలోని బస్ స్టేషన్ ఆవరణలో శనివారం రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. మాజీ యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మానుమండ్ల శ్రీనివాస్, మాజీ మండల ప్రధాన కార్యదర్శి కోరేపు సంపత్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుంటూ మంత్రి శ్రీధర్ బాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అబ్బాపూర్ గ్రామ సర్పంచ్ దండే వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, శ్రీధర్ బాబు పేద ప్రజల పెన్నిధి, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అని కొనియాడారు. రాష్ట్రంలో ఐటీ రంగ అభివృద్ధికి విశేష కృషి చేస్తూ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న నాయకుడిగా ఆయన గుర్తింపు పొందారని అన్నారు. శ్రీధర్ బాబు ఆయురారోగ్యాలతో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ మల్లారం సంతోష్, అనగాని లింగయ్య గౌడ్, శాతల కాంతయ్య, చిదురి శ్రీనివాస్, గౌస్ బాష, ముమ్మాడి రవి, పల్నాటి రవి, ఆవుల సంతోష్ యాదవ్, గుండా సాగర్, కొట్టే సంజీవ్, దేవి లక్ష్మీనరసయ్య, సంకెళ్ల చంద్రయ్య, చెరుకు కనకయ్య, ఇరువురాల ప్రభాకర్, మల్లారపు భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సేవే ధ్యేయంగా ముందుకు..

- అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ఎమ్మెల్యే నిరంతర కృషి

**వేద న్యూస్, కారేపల్లి:**



ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రామ స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు నిరంతరం శ్రమిస్తున్న వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ప్రజల మన్ననలు పొందుతున్నారు. ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామ్యం అవుతూ ప్రతి గ్రామ అభివృద్ధికి కృషి చేస్తున్నారు. తాగునీరు, రహదారులు, విద్య, వైద్యం, సాగునీటి సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తున్న ఆయన, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరేలా చర్యలు చేపడుతున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా తెలుసుకొని అధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ పరిష్కారానికి కృషి చేస్తున్నారు. అభివృద్ధి, సంక్షేమం అనే ద్వంద్వ లక్ష్యాలతో నియోజకవర్గాన్ని ముందుకు నడిపిస్తున్న రాందాస్ నాయక్ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సేవాభావంతో పనిచేస్తున్నారు. దీంతో నియోజకవర్గ ప్రజల్లో ఆయనకు ప్రత్యేక గుర్తింపు లభిస్తోంది.

# టీచర్లపై పనిభారం పెంచొద్దు

- మండుటెండల్లో జనగణన విధులతో ఉపాధ్యాయుల ఇబ్బందులు
- బీసీటీయూ జిల్లా అధ్యక్షుడు పెరుమాండ్ల సాంబమూర్తి

**వేద న్యూస్, కాజీపేట:**



మండుటెండల్లో జనగణన విధులు నిర్వహిస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయులపై అదనపు పనిభారం మోపడం గర్హనీయమని బీసీ టీచర్స్ యూనియన్ (బీసీటీయూ) వరంగల్ జిల్లా అధ్యక్షుడు పెరుమాండ్ల సాంబమూర్తి విమర్శించారు. కాజీపేటలో విలేకరులతో మాట్లాడుతూ, మే మొదటి వారం నుంచి జూన్ 9 వరకు కొనసాగుతున్న జనగణన విధులతో ఉపాధ్యాయులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని అన్నారు. ఇదే సమయంలో బడిబాట కార్యక్రమం, సర్వీస్ బుక్ ఆన్‌లైన్ ప్రక్రియ, హెల్త్ కార్డు వివరాల నమోదు వంటి పనులను ప్రభుత్వం అప్పగించడం వల్ల టీచర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సర్వీస్ బుక్ వివరాల నమోదు, హెల్త్ కార్డు ప్రక్రియ కోసం ఉపాధ్యాయులు తిరిగి పాఠశాలలకు వెళ్లాల్సి వస్తోందని, వివిధ మండలాల్లో వేర్వేరు విధానాలు అమలు కావడంతో మరిన్ని సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. జనగణన విధుల్లో ఉపాధ్యాయులు నిమగ్నమై ఉన్న నేపథ్యంలో సర్వీస్ బుక్ ఆన్‌లైన్, హెల్త్ కార్డు నమోదు ప్రక్రియలను తాత్కాలికంగా వాయిదా వేయాలని పలు ఉపాధ్యాయ సంఘాలు కోరినా ప్రభుత్వం స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో బడిబాట కార్యక్రమ లక్ష్యాలు కూడా ప్రభావితమయ్యే అవకాశం ఉందని పేర్కొంటూ, ఉపాధ్యాయుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకోవాలని బీసీటీయూ తరపున సాంబమూర్తి విజ్ఞప్తి చేశారు.

# పారిశుధ్య కార్మికులకు రూ.5 లక్షల బీమా

- ప్లాస్టిక్ ప్లేట్లపై నిషేధం
- వేములవాడ కౌన్సిల్ కీలక నిర్ణయాలు
- వర్షాకాల సన్నద్ధతపై అధికారులకు ఆదేశాలు

**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి:**




వేములవాడ మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ పుల్కం రాజు అధ్యక్షతన జరిగిన సాధారణ సమావేశంలో 52 అజెండా అంశాలకు ఆమోదం లభించింది. పట్టణంలోని ఫంక్షన్ హాళ్లలో ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసుల వినియోగాన్ని నిషేధిస్తూ కౌన్సిల్ నిర్ణయం తీసుకుంది. అలాగే 203 మంది పారిశుధ్య కార్మికులకు రూ.5 లక్షల ప్రమాద బీమా కల్పించనున్నారు. జేసీబీ కొనుగోలు ప్రతిపాదనను రద్దు చేసి, చెత్త సేకరణ కోసం నాలుగు ట్రాలీ ఆటోలను కొనుగోలు చేయాలని ఆమోదించారు. వర్షాకాలం నేపథ్యంలో కాలువల పూడికతీత, రోడ్ల మరమ్మతులు, పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని చైర్మన్ పుల్కం రాజు అధికారులను ఆదేశించారు. పట్టణంలో చెత్త వేయొద్దంటూ 500 సూచిక బోర్డులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సహకారంతో వేములవాడను ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామని చైర్మన్ పేర్కొన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ నరాల శేఖర్, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

# జెడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలకు

- జాతీయ స్థాయిలో కన్సొలేషన్ అవార్డు
- పొగాకు వ్యతిరేక ప్రచారానికి జాతీయ గుర్తింపు
- న్యూఢిల్లీలో అవార్డు స్వీకరించిన పాఠశాల ప్రతినిధులు

**వేద న్యూస్, చొప్పదండి కరీంనగర్ జిల్లా:**




చొప్పదండి మండలంలోని పీఎంశ్రీ జెడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాల జాతీయ స్థాయిలో మరో గుర్తింపును సొంతం చేసుకుంది. 'టోఫీ -స్కూల్ ఛాలెంజ్: టువార్డ్స్ ఎ టొబాకో ఫ్రీ జనరేషన్-2025' పోటీల్లో పాఠశాల కన్సొలేషన్ అవార్డును కైవసం చేసుకుంది. పొగాకు వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై విద్యార్థినులు నిర్వహించిన అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు, పోస్టర్ ప్రదర్శనలు, ప్రతిజ్ఞ కార్యక్రమాలు జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకున్నాయి. ఈ అవార్డును స్వీకరించేందుకు ప్రధానోపాధ్యాయులు జంగం శ్రీనివాస్, ఉపాధ్యాయులు యామ తిరుపతి న్యూఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమిష్టి కృషికి లభించిన గుర్తింపే ఈ పురస్కారమని ప్రధానోపాధ్యాయులు తెలిపారు. విద్యార్థుల్లో ఆరోగ్యకరమైన జీవన విధానాలపై అవగాహన పెంపొందించే కార్యక్రమాలను భవిష్యత్తులో కూడా కొనసాగిస్తామని పాఠశాల యాజమాన్యం పేర్కొంది.

# రూ.66 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

- అంగన్‌వాడీ, మహిళా సంఘ భవనాలకు శ్రీకారం
- పనులు నాణ్యతతో పూర్తి చేయాలి
- ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సూచన



**వేద న్యూస్, నల్లబెల్లి:**

నల్లబెల్లి మండలంలోని పలు గ్రామాల్లో రూ.66 లక్షల వ్యయంతో చేపట్టనున్న అంగన్‌వాడీ, మహిళా సంఘాలు, మహిళా సమాఖ్య భవనాల నిర్మాణ పనులకు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి శంకుస్థాపనలు చేశారు. బుచ్చిరెడ్డిపల్లి, అర్షన్‌పల్లి (బొల్లోనిపల్లి), నాగరాజుపల్లె గ్రామాల్లో రూ.12 లక్షల చొప్పున అంగన్‌వాడీ భవనాలకు శంకుస్థాపన చేశారు. అలాగే కొండాపూర్, ముచింపుల, రేలకుంట గ్రామాల్లో మహిళా సంఘాలు, మహిళా సమాఖ్య భవనాల నిర్మాణ పనులను ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు, చిన్నారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ఈ భవనాలు ఉపయోగపడతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పనులను నాణ్యత ప్రమాణాలతో త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

- ప్రభుత్వ ఆసుపత్రిలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ
- రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**



జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని శనివారం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఐఎంయూ, ఐసీయూ, ఎస్ఎన్‌సీయూ, మెటర్నిటీ వార్డులను పరిశీలించి రోగులతో మాట్లాడారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలపై ఆరా తీసి, వైద్యులు, సిబ్బంది సమయానుసారంగా అందుబాటులో ఉండాలని సూచించారు. రోగుల ఆరోగ్య పరిస్థితి, చికిత్స వివరాలను తెలుసుకున్న కలెక్టర్, ఎండాకాలంలో ప్రజలకు ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఐఎంయూ వార్డులో చికిత్స పొందుతున్న విద్యార్థులతో మాట్లాడి, ఉన్నత విద్యతో పాటు స్వయం ఉపాధి కోర్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ తనిఖీలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రవీణ్ కుమార్, వైద్యులు, అధికారులు పాల్గొన్నారు.

# నేడు 'డయల్ యువర్ డీఎం'

- ఆర్టీసీ సేవలపై ఫిర్యాదులు, సూచనలు స్వీకరణ

**వేద న్యూస్, నాగర్‌కర్నూల్:**

నాగర్‌కర్నూల్ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో నేడు 'డయల్ యువర్ డీఎం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ తెలిపారు. ఆదివారం సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు ప్రయాణికుల సమస్యలు, సూచనలను ఫోన్ ద్వారా స్వీకరించనున్నారు. ఆర్టీసీ సేవలకు సంబంధించిన ఫిర్యాదులు, సమస్యలతో పాటు సేవల మెరుగుదలకు సంబంధించిన సూచనలను కూడా నేరుగా డిపో మేనేజర్‌కు తెలియజేయవచ్చని పేర్కొన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా, పరిసర ప్రాంతాల ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ కోరారు.

వేద న్యూస్

ఆదివారం మే 31 , 2026

# ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- తూకం వేయడంలో జాప్యం వద్దు
- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశాలు

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**



కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకు వచ్చిన ధాన్యాన్ని తూకం వేయడంలో జాప్యం చేయకుండా, సేకరణ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. శనివారం ధాన్యం కొను గోళ్లు, లోడింగ్, అన్‌లోడింగ్, ఆన్‌లైన్ ట్యాబ్ ఎంట్రీలపై వివిధ శాఖల అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించిన కలెక్టర్, రోజువారీ కొనుగోళ్ల శాతం పెరిగేలా పర్యవేక్షణ చేయాలని సూచిం చారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుండా చర్యలు తీసుకోవడంతో పాటు, తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తామనే భరోసాను రైతులకు కల్పించాలని అన్నారు. మిల్లర్లు అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఆన్‌లైన్ ఎంట్రీలను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్ల తుది దశలో ఉన్న కేంద్రాలను త్వరితగతిన పూర్తి చేసి, అవసరమైన వాహనాలు, హమాలీలను ఇతర కేంద్రాలకు తరలించాలని కలెక్టర్ సూచించారు.

# ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ పంపిణీ

- లబ్ధిదారులకు అందజేసిన ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి



**వేద న్యూస్, చిన్నచింతకుంట:**

చిన్నచింతకుంట మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 21 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్‌ను దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి శనివారం దమగ్నాపూర్ గ్రామంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పూరిగుడిసెల్లో జీవిస్తున్న పేదలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ద్వారా సొంతింటి కల నెరవేరుతోందని అన్నారు. ప్రభుత్వం పారదర్శకంగా లబ్ధిదారుల ఖాతాల్లోనే నిధులు జమ చేస్తోందని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కావడంతో ఆనందం వ్యక్తం చేసిన లబ్ధిదారులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచులు మాట్లాడుతూ, ఎలాంటి పైరవీలు లేకుండా అర్హులకు ఇళ్లు మంజూరు చేయడం ప్రజాపాలనకు నిదర్శనమని పేర్కొన్నారు.

# రోడ్డు ప్రమాద బాధితుడికి పరామర్శ

- పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని కోట రాము భరోసా

**వేద న్యూస్, చిన్నచింతకుంట:**



చిన్నచింతకుంట మండలం ఉంద్యాల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు బి. మహిపాల్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోట రాము శనివారం ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా మహిపాల్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న కోట రాము, పార్టీలో నిబద్ధతతో పనిచేసే నాయకులకు బీఆర్ఎస్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. త్వరగా కోలుకుని మళ్లీ ప్రజా సేవలో పాల్గొనాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు కరుణాకర్ రెడ్డి, అజయ్ కుమార్ రెడ్డి, ఉంద్యాల గ్రామ ఉప సర్పంచ్‌తో పాటు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మండల యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా విన్సెంట్

- ఎమ్మెల్యే చేతుల మీదుగా నియామక పత్రం అందజేత

**వేద న్యూస్, చిన్నచింతకుంట:**



చిన్నచింతకుంట మండల యూత్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వగ్గుల విన్సెంట్‌కు శనివారం దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా విన్సెంట్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతం కోసం అహర్నిశలు కృషి చేస్తూ యువతను కాంగ్రెస్ వైపు ఆకర్షించేందుకు పనిచేస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల నాయకులు, యూత్ నాయకులు విన్సెంట్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

# అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

- ఫిర్యాదులు చేసినా స్పందించని మున్సిపల్ అధికారులు
- ఏఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో నిరసన

**వేద న్యూస్, సిరిసిల్ల:**

సిరిసిల్ల పట్టణంలో అక్రమ నిర్మాణాలు, రోడ్లు మరియు నాలాల కబ్జాలపై పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ ఏఐఎఫ్‌టీయూ నాయకులు మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐఎఫ్‌టీయూ న్యూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సోమిశెట్టి దశరథం మాట్లాడుతూ, పట్టణంలో పలుచోట్ల నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. సంజీవయ్య నగర్‌లో జి ప్లస్-2 అనుమతితో జి ప్లస్-4 భవనం నిర్మించి, నిబంధనలకు విరుద్ధంగా ఆస్పత్రి నిర్వహిస్తున్నారని ఆరోపించారు. అక్రమ నిర్మాణాలు, నాలా మరియు రోడ్డు కబ్జాలపై ఫిర్యాదులు చేసినా రాజకీయ ఒత్తిళ్ల కారణంగా అధికారులు స్పందించడం లేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రజా సమస్యలపై దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని, లేకుంటే ఆందోళనలు మరింత




ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సలేంద్రి ఎల్లయ్య, గుజ్జ దేవదాస్, ప్రసాద్, లచ్చన్న, ఆకన సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

# 'అమ్మ మాట - అంగన్‌వాడీ బాట'

- చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించాలని అవగాహన
- వర్షకొండలో ర్యాలీ నిర్వహించిన అధికారులు



**వేద న్యూస్, ఇబ్రహీంపట్నం:**

తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన 'అమ్మ మాట - అంగన్‌వాడీ బాట' కార్యక్రమాన్ని ఇబ్రహీంపట్నం మండలంలోని వర్షకొండ గ్రామంలో సర్పంచ్ పొనుకంటి చిన్న వెంకట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామపంచాయతీ కార్యాలయం నుంచి ర్యాలీ చేపట్టి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ చిన్న వెంకట్ మాట్లాడుతూ, అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యతో పాటు శారీరక, మానసిక అభివృద్ధికి అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. యూనిఫాంలు, పుస్తకాలు, పోషకాహార భోజనం, గుడ్లు, పాలు, స్నాక్స్ అందిస్తున్నట్లు వివరించారు. మూడేళ్లు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించి ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు పిస్కా చంద్రశేఖర్, అంగన్‌వాడీ టీచర్లు పద్మావతి, చిన్నగంగు, రాజన్న, చిన్నారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# కనీస వేతనాల పెంపుతో కార్మికులకు అన్యాయం

- పెంచింది చారెడు.. ప్రచారం మాత్రం బారెడు
- టీయూసీఐ రాష్ట్ర అధ్యక్షుడు కె. సూర్యం

**వేద న్యూస్, దేవరకద్ర (అమరచింత):**

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస వేతనాల పెంపు కార్మికులకు ప్రయోజనం కంటే అయోమయాన్ని కలిగిస్తోందని టీయూసీఐ రాష్ట్ర అధ్యక్షుడు కె. సూర్యం విమర్శించారు. అమరచింతలోని మార్క్స్ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం మూడు జోన్ల విధానంతో కొత్త ప్రతిపాదనలు తీసుకొచ్చినా వాటిలో సమగ్రత, స్పష్టత లేదన్నారు. 2021లో ఐదు జీవోల్లో బేసిక్ వేతనాన్ని రూ.18 వేలుగా నిర్ణయించినప్పటికీ, ఆ నిర్ణయాన్ని అమలు చేయకుండా కొత్త వేతనాల ప్రకటన చేయడం కార్మికుల్లో అనుమానాలకు తావిస్తోందన్నారు. ప్రస్తుతం కొన్ని కేటగిరీల కార్మికులు పొందుతున్న వేతనాల కంటే తక్కువ మొత్తాలు ప్రకటించడం వల్ల వారికి నష్టం జరిగే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. కార్మిక సంఘాలు చాలా కాలంగా కనీస వేతనాన్ని రూ.26 వేలుగా నిర్ణయించాలని డిమాండ్ చేస్తున్నాయని, ధరల




పెరుగుదలను దృష్టిలో ఉంచుకుని శాస్త్రీయ పద్ధతిలో వేతన సవరణ చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. వీడీఏ అమలుపై కూడా ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాల పెంపుపై జీఓ-60ను వెంటనే విడుదల చేయాలని టీయూసీఐ తరఫున కోరారు. ఈ సమావేశంలో టీయూసీఐ ఉమ్మడి జిల్లా నాయకులు జె.ఎన్. దేవదానం, పి. అరుణ్ కుమార్, సి. రాజు, కోళ్ల వెంకటన్న, కొండన్న, వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# నాలుగు లేబర్ కోడ్లను వెంటనే ఉపసంహరించాలి

- సిఐటియు జిల్లా అధ్యక్షులు సింగారపు కృష్ణ

**వేద న్యూస్, కరీమాబాద్ :**

తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు వరంగల్ జిల్లా కేంద్రం 40 డివిజన్ ఉర్సు కరీమాబాద్ మున్సిపల్ వార్డు కార్యాలయం ముందు సీఐటీయూ మున్సిపల్ 56వ దినోత్సవ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షులు సింగారపు కృష్ణ సిఐటియు జెండా ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను వెంటనే ఉపసంహరించాలని డిమాండ్ చేశారు.పని భద్రత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జవాన్లు సిఐటియు నాయకులు వర్కాల ఆదాం, కార్మికులు మహిళా నాయకులు దౌడు స్వరూప, మంద లక్ష్మి, మునిగాల ఐలయ్య, రాజ్ కుమార్, శివ, డ్రైవర్లు వంశీ, మల్లేశం పాల్గొన్నారు.



# హైవేపై పల్టీ కొట్టిన కారు.. కానిస్టేబుల్ మృతి..!

**వేద న్యూస్ ఖమ్మం :**

ఖమ్మం జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో హైదరాబాద్‌కు చెందిన కానిస్టేబుల్ మృతి చెందాడు. గ్రీన్ ఫీల్డ్ హైవేపై ఐరన్ రెయిలింగ్‌ను కారు ఢీకొని పల్టీ కొట్టిన ఘటనలో జస్వంత్(36) అనే కానిస్టేబుల్ మరణించాడు. కుటుంబంతో కలిసి కారులో అన్నవరం వెళ్లి తిరిగి హైదరాబాద్ వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది.హైదరాబాద్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న జస్వంత్ కుటుంబంతో కలిసి ఏపీలోని అన్నవరం వెళ్లాడు. దర్శనం అయ్యాక తిరిగి హైదరాబాద్ వస్తుండా ఖమ్మం జిల్లా తల్లాడ మండలంలోని గ్రీన్ ఫీల్డ్ హైవేపై ఐరన్ రెయిలింగ్‌ను వీరు కారు ఢీకొట్టి.. పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో జస్వంత్ అక్కడికక్కడే మృతి చెందాడు. అతడి భార్య, కూతురు, కుమారుడు ప్రాణాలతో బయటపడ్డారు.

# మానవపాడులో స్తంభించిన జనజీవనం!

- ఉప్పొంగి ప్రవహిస్తున్న పెద్దవాగు.. నిలిచిపోయిన రాకపోకలు
- శాశ్వత పరిష్కారంగా వంతెన నిర్మించాలని గ్రామస్తుల విజ్ఞప్తి



**వేద న్యూస్, మానవపాడు:**

జోగులాంబ గద్వాల్ జిల్లా మానవపాడు మండలంలో శుక్రవారం తెల్లవారుజాము నుంచి కురిసిన భారీ వర్షాలకు జనజీవనం అస్తవ్యస్తమైంది. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాల ప్రభావంతో పెద్దవాగు ఉప్పొంగి ప్రవహించడంతో గ్రామాల మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. వాగుపై భారీగా నీరు ప్రవహించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అత్యవసర పనుల కోసం వెళ్లాల్సిన వారు, విద్యార్థులు, ఉద్యోగులు తమ గమ్యస్థానాలకు చేరుకోలేక ఇళ్లకే పరిమితమయ్యారు. తక్కువ ప్రాంతాలు జలమయమవగా, పలు రైతుల పొలాల్లోకి వరద నీరు చేరింది. ప్రమాదకర పరిస్థితుల దృష్ట్యా వాగు వద్దకు వెళ్లొద్దని అధికారులు ప్రజలను హెచ్చరించారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతి వర్షాకాలంలో ఇదే సమస్య ఎదురవుతోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని శాశ్వత పరిష్కారంగా పెద్దవాగుపై వంతెన నిర్మించాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# సీఐను మర్యాద పూర్వకంగా కలిసిన వనం మహేందర్

- అసాంఘిక కార్యకలాపాలను అదుపు చేయాలని వినతి



**వేద న్యూస్, వరంగల్ టౌన్ :**

మిల్స్ కాలనీ నూతన సీఐగా బాధ్యతలు చేపట్టిన కర్రే స్వామిను శనివారం బీఎస్పీ పార్టీ తూర్పు నియోజకవర్గ ఇంచార్జ్, ఐఐటీ ఎక్స్పర్ట్ వనం మహేందర్ మర్యాదపూర్వకంగా కలిసి పూలబుకే ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో కొంతమంది యువత మద్యం-మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్నారని, చేడు మార్గం నుంచి మంచి మార్గానికి వచ్చేలా కృషి చేయాలని వారు కోరారు. స్టేషన్ పరిధిలో జరిగే అసాంఘిక కార్యకలాపాలను అదుపు చేయాలని మనవి చేశారు. సీఐను కలిసిన వారిలో పోగుల రాజు కుమార్, పోలేపాక లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

# ‘కథ చెబుతా.. వింటారా?’

- కథల పోటీకి ఆహ్వానం
- సాగంటీస్ ఆర్ట్స్ అకాడమీ వినూత్న ప్రయత్నం
- చిన్నారుల్లో తెలుగు భాషపై మక్కువ పెంచేందుకే..
- ఎంపికైన కథలను పుస్తక రూపంలో ప్రచురించనున్న నిర్వాహకులు

**వేద న్యూస్, హనుమకొండ:**

చిన్నారుల్లో తెలుగు భాషపై ఆసక్తి, విలువలు, కథన నైపుణ్యాలను పెంపొందించేందుకు హనుమకొండకు చెందిన సాగంటీస్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో “కథ చెబుతా... వింటారా?“ పేరుతో కథల పోటీ నిర్వహిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ మంజుల సాగంటి తెలిపారు. జూన్ నెలలో నిర్వహించనున్న ఈ పోటీలో పాల్గొనదలిచిన చిన్నారులు తమ పేర్లను 8143643337 నంబర్‌కు నమోదు చేసుకోవాలని సూచించారు. ఇంట్లోనే 2 నిమిషాల నిడివి గల నీతి, విలువలు కలిగిన కథను చెప్పించి వీడియో తీసి వాట్సాప్‌కు పంపాలని తెలిపారు. ఎంపికైన చిన్నారులకు న్యాయనిర్ణేతల సమక్షంలో తుది పోటీ నిర్వహిస్తారు. ఈ పోటీని 1-3 తరగతులు, 4-6 తరగతులు, 7-10 తరగతులు అనే మూడు విభాగాలుగా నిర్వహించనున్నారు. పోటీదారులు 3 నిమిషాల వ్యవధిలో కథ చెప్పాల్సి ఉంటుంది. కథలు నీతి, విలువలు, మంచి సందేశాన్ని అందించే విధంగా ఉండాలని నిర్వాహకులు పేర్కొన్నారు. పాల్గొనే ప్రతి ఒక్కరికీ ప్రశంసాపత్రం అందజేయడంతో పాటు విజేతలకు ప్రత్యేక బహుమతులు ప్రదానం చేస్తారు. కథ చెప్పే వీడియోతో పాటు కథ వ్రాతప్రతి, ఫోటోను కూడా సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. ఎంపికైన చిన్నారుల కథలను పుస్తక రూపంలో ప్రచురించనున్నట్లు డాక్టర్ మంజుల సాగంటి వెల్లడించారు.

# లిఫ్ట్ శంకుస్థాపనకు విచ్చేసిన మంత్రులకు స్వాగతం

- ఎమ్మెల్యే నాయకత్వంలో ఆత్మీయ ఆహ్వానం



**వేద న్యూస్, దేవరకద్ర:**

దేవరకద్ర నియోజకవర్గంలోని అజిలాపూర్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు శంకుస్థాపన కార్యక్రమానికి శనివారం విచ్చేసిన మంత్రులకు ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి నాయకత్వంలో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, పరిసర గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి మంత్రులను ఆత్మీయంగా ఆహ్వానించారు. నినాదాలతో, హర్షధ్వానాలతో కార్యక్రమ ప్రాంగణం సందడిగా మారింది. అజిలాపూర్ లిఫ్ట్ ప్రాజెక్టు పూర్తయితే నియోజకవర్గంలోని రైతాంగానికి సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని నాయకులు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వడ్డీ జలగలు!



- గద్వాల్ జిల్లాలో యథేచ్ఛగా ప్రైవేట్ ఫైనాన్స్ దందా
- అధిక వడ్డీలతో అప్పుల ఊబిలోకి కుటుంబాలు
- తనఖా పేరుతో ఇళ్లు, భూములు స్వాధీనం
- డైలీ, వీక్లీ వసూళ్లతో సామాన్యులపై భారాలు
- అనుమతులు లేని ఫైనాన్స్ సంస్థలపై చర్యలు తీసుకోవాలి
- ప్రత్యేక నిఘా పెట్టాలంటున్న బాధితులు

**వేద న్యూస్, గద్వాల్ ప్రతినిధి:**

గద్వాల్ జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ వడ్డీ వ్యాపారం జోరుగా సాగుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజల అత్యవసర ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకుని కొందరు ఫైనాన్స్ సంస్థలు, ప్రైవేట్ వడ్డీ వ్యాపారులు అధిక వడ్డీలు వసూలు చేస్తూ పేద, మధ్యతరగతి కుటుంబాలను అప్పుల ఊబిలోకి నెట్టేస్తున్నారని బాధితులు వాపోతున్నారు. డబ్బులు ఇచ్చే పేరుతో బైక్‌లు, కార్లు, ఇళ్ల పత్రాలు, ప్లాట్ల డాక్యుమెంట్లు తనఖా పెట్టించుకుని, కిస్తీలు ఆలస్యమైతే అదనపు వడ్డీలు, జరిమానాలు విధిస్తున్నారని ఆరోపిస్తున్నారు. మైక్రో ఫైనాన్స్ సంస్థలు వారానికి ఒకసారి వసూళ్లు చేస్తుండగా, డైలీ ఫైనాన్స్ పేరుతో చిరు వ్యాపారుల నుంచి ప్రతిరోజూ డబ్బులు వసూలు చేస్తున్న పరిస్థితి నెలకొంది. వడ్డీపై వడ్డీ వేయడం వల్ల కొంతమంది తమ భూములు, ఇళ్లు కోల్పోయిన ఘటనలు కూడా ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. ప్రభుత్వ బ్యాంకుల నుంచి సులభంగా రుణాలు అందకపోవడంతో ప్రజలు ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలను ఆశ్రయించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో అనుమతులతో నడుస్తున్న ఫైనాన్స్ సంస్థలు ఎన్ని, అనుమతులు లేకుండా పనిచేస్తున్నవి ఎన్ని అనే అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. అక్రమ వడ్డీ వ్యాపా రులపై కఠిన చర్యలు తీసుకుని పేద కుటుంబాలను రక్షించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# పరిశుభ్రతే ఆరోగ్యానికి పునాది

- ‘ఊరు కోసం ఒక్క రోజు శ్రమదానం’కు విశేష స్పందన



**వేద న్యూస్, కమలాపూర్:**

గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలంటే పారిశుధ్య కార్మికులపై మాత్రమే ఆధారపడకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కమలాపూర్ సర్పంచ్ పబ్బు సతీష్ అన్నారు. ఊరు కోసం ఒక్క రోజు శ్రమదానం కార్యక్రమంలో భాగంగా శనివారం 11వ వార్డులో నిర్వహించిన పారిశుద్ధ్య కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు ఉన్న వీధుల్లో చెత్త తొలగించి, మురుగు కాలువలను శుభ్రం చేశారు. ఉప సర్పంచ్ పుల్ల శ్రీనివాస్, మాజీ ఎంపీపీ మాట్ల రమేష్, వార్డు సభ్యులు, అంబేద్కర్ విజ్ఞాన కేంద్రం, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే గ్రామం స్వచ్ఛంగా మారుతుందని అన్నారు. స్వచ్ఛ కమలాపూర్ లక్ష్యంతో చేపట్టిన ఈ కార్యక్రమం నాలుగో వారానికి చేరుకుందని, దీనికి ప్రజల భాగస్వామ్యం అత్యంత అవసరమని పేర్కొన్నారు. గ్రామాన్ని ఆదర్శవంతమైన పరిశుభ్ర గ్రామంగా తీర్చిదిద్దేందుకు వినూత్న కార్యక్రమాలు చేపడుతున్న సర్పంచ్ పబ్బు సతీష్‌ను గ్రామస్థులు అభినందిస్తున్నారు.

# సింగిల్ టెండర్ల వెనుక ఆంతర్యం ఏంటి?

- యూఐడీఎఫ్ పనుల టెండర్లపై సీపీఐ అనుమానాలు
- సమగ్ర విచారణ జరపాలన్న పంజాల శ్రీనివాస్




**వేద న్యూస్, కరీంనగర్:**

కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో యూఐడీఎఫ్ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులకు దాఖలైన సింగిల్ టెండర్లను వెంటనే రద్దు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శనివారం బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రూ.50 కోట్ల విలువైన పనులకు నిర్వహించిన 87 టెండర్లలో 69 పనులకు ఒక్క బిడ్ మాత్రమే దాఖలవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. టెండర్ ప్రక్రియలో పోటీ లేకపోవడం వల్ల ప్రభుత్వానికి నష్టం జరిగే అవకాశం ఉందని, ప్రజాధనం దుర్వినియోగమయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. పెద్ద మొత్తంలో పనులకు పలువురు కాంట్రాక్టర్లు పోటీ పడే అవకాశం ఉన్నప్పటికీ సింగిల్ టెండర్లు మాత్రమే రావడం వెనుక కారణాలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్పొరేషన్‌లో టెండర్ వ్యవహారాలపై పారదర్శకత లేకపోవడం పట్ల ప్రజల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. వెంటనే సింగిల్ టెండర్ల విధానాన్ని రద్దు చేసి, పారదర్శకంగా మళ్లీ టెండర్లు నిర్వహించాలని కోరారు. లేనిపక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీపీఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్ కుమార్, టేకుమల్ల సమ్మయ్య, న్యాలపట్ల రాజు, పైడిపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

వేద న్యూస్
ఆదివారం మే 31, 2026

## చిన్నారులను అంగన్‌వాడీలకు పంపించాలి

**వేద న్యూస్, శంకరపట్నం:**



- ఐసీడీఎస్ సూపర్వైజర్ అరుణ

శంకరపట్నం మండలంలోని కేశవపట్నం-2 అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం 'అమ్మ మాట అంగన్‌వాడీ బడిబాట' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్వైజర్ అరుణ ఆధ్వర్యంలో ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా జరుగుతున్న మహిళల వారోత్సవాల సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గ్రామ సర్పంచ్ గోదారి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ,

ఐదు సంవత్సరాల లోపు పిల్లలందరినీ అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న అంగన్‌వాడీ సేవలను ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు ఆటపాటల ద్వారా ప్రాథమిక విద్యతో పాటు సామాజిక నైపుణ్యాలను కూడా అభివృద్ధి చేసుకుంటారని తెలిపారు. అనంతరం చిన్నారులకు యూనిఫామ్‌లు పంపిణీ చేసి గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆకుపత్తిని విజయ్, గ్రామ కార్యదర్శి నరసయ్య, అంగన్‌వాడీ టీచర్లు, చిన్నారుల తల్లులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఆరవ రోజుకు చేరిన వీవోఏల నిరవధిక సమ్మె



**వేద న్యూస్, రుద్రూర్:**

రుద్రూర్ మండల కేంద్రంలోని మండల సమీకృత కార్యాలయం ఎదుట ఐకేపీ వివోఏలు చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం నాటికి ఆరవ రోజుకు చేరుకుంది. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం వివోఏలు ఆందోళన కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వివోఏలకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని, పని భారం తగ్గించాలని, అర్హులైన వారికి సీసీలుగా పదోన్నతులు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే జీఓ-58ను సవరించి, వివోఏలకు రూ.20 లక్షల వరకు సాధారణ, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఆందోళన కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ సమ్మెలో అధ్యక్షురాలు జరినా, ఉపాధ్యక్షురాలు జిజియా భాయ్, కార్యదర్శి జి. స్వరూప, సహాయ కార్యదర్శి నాగరాణి, కోశాధికారి లావణ్య, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## భారత్ గ్యాస్ దోపిడీ!

- డెలివరీ పేరుతో అధిక వసూళ్లు
- వినియోగదారుల పై అదనపు భారం





**వేద న్యూస్, రుద్రూర్:**

రుద్రూర్ మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల్లో భారత్ గ్యాస్ డెలివరీ సిబ్బంది వినియోగదారుల నుంచి అదనపు డబ్బులు వసూలు చేస్తున్నారని పలువురు వినియోగదారులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం లేదా ఆయిల్ కంపెనీలు నిర్ణయించిన ధరలకే గ్యాస్ సిలిండర్లు సరఫరా అవుతున్నప్పటికీ, రవాణా, హమాలీ, మెట్లెక్కింపు, నిర్వహణ ఖర్చుల పేరుతో డెలివరీ బాయ్స్ రూ.30 నుంచి రూ.60 వరకు అదనంగా వసూలు చేస్తున్నట్లు వినియోగదారులు పేర్కొంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా ఈ తరహా వసూళ్లు జరుగుతున్నాయని, సిలిండర్ తీసుకునే సమయంలో అదనపు డబ్బులు ఇవ్వాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు విచారణ జరిపి, అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న వారిపై తగిన చర్యలు తీసుకోవాలని వినియోగదారులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే గ్యాస్ సరఫరాలో పారదర్శకత పాటించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

## వరికొయ్యలను తగలబెడుతూ.. నిప్పంటుకొని రైతు మృతి..!

**వేద న్యూస్ సిద్ధిపేట :**



సిద్ధిపేట జిల్లా అక్బర్ పేట భూంపల్లి మండలంలో ఎనగుర్తిలో విషాదం నెలకొంది. వానాకాలం పంట సాగు కోసం పొలంలోని వరి కొయ్యలను తగలబెట్టే క్రమంలోఎల్లయ్య(60) అనే రైతు ప్రాణాలు కోల్పోయాడు.శనివారం పొలంలో ఎల్లయ్య వరి కొయ్యలను తగబెడుతుండగా పొగ, మంటలు చుట్టుముట్టడంతో ఆయనకు ఊపిరాడలేదు. శ్వాస తీసుకోవడం కష్టమవ్వడంతో కిందపడిపోయిన ఎల్లయ్యకు మంటలంటుకున్నాయి. మంటల కారణంగా తీవ్రగాయాలు కావడంతో ఎల్లయ్య మృతి చెందాడు

## వెంకట్ రాములు మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు

- కుటుంబ సభ్యులను పరామర్శించిన ఆదిత్య రెడ్డి



**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి:**

వేములపల్లి మండలం ఆమనగల్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దేశబోయిన వెంకట్ రాములు (77) మృతి పట్ల రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జిల్లెల్ల చిన్నారెడ్డి తనయుడు ఆదిత్య రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శనివారం ఆయన వెంకట్ రాములు నివాసానికి చేరుకుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఆదిత్య రెడ్డి మాట్లాడుతూ, వెంకట్ రాములు జీవితాంతం ప్రజల కోసం, కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం కృషి చేశారని కొనియాడారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అండగా నిలిచిన నాయకుడిగా ఆయనను గుర్తు చేసుకున్నారు. ఆయన మరణం కాంగ్రెస్ పార్టీకి, గ్రామ ప్రజలకు తీరని లోటని పేర్కొన్నారు. వెంకట్ రాములు తనయుడు, ఓబీసీ స్టేట్ కోఆర్డినేటర్ దేశబోయిన రవికుమార్‌ను పరామర్శించి ధైర్యం చెప్పారు. కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కోల సైదులు, పెరుమాండ్ల రమేష్, ఎల్లయ్య, అశోక్, బయ్య సైదులు తదితరులు పాల్గొన్నారు.

## మహ్మద్ జావేద్ సంస్మరణ సభను విజయవంతం చేయండి

- కాంగ్రెస్ శ్రేణులకు డీసీసీ అధ్యక్షుడు సత్యనారాయణ గౌడ్ పిలుపు



**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి:**

ఖమ్మం నగరంలో ఆదివారం నిర్వహించనున్న స్వర్గీయ మహ్మద్ జావేద్ సంస్మరణ సభను విజయవంతం చేయాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్ కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఏఐసీసీ కార్యదర్శి, తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాకిటి శ్రీహరి, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పార్లమెంట్ సభ్యుడు రామసహాయం రఘురాం రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లు హాజరుకానున్నట్లు తెలిపారు. మహ్మద్ జావేద్ సేవలను స్మరించుకునే ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై సభను జయప్రదం చేయాలని నూతి సత్యనారాయణ గౌడ్ కోరారు.

## మరిపెడలో పోలీసుల కార్డన్ అండ్ సెర్చ్

- **1000 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం**
- **50 లీటర్ల సారా స్వాధీనం.. 10 బైకులు సీజ్**



**వేద న్యూస్, మరిపెడ:**

మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్ ఆదేశాల మేరకు మరిపెడ మండల పరిధిలో పోలీసులు శనివారం తెల్లవారుజామున విస్తృత స్థాయిలో కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. అక్రమ సారా తయారీ, చట్టవ్యతిరేక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ కోటియా తండా గ్రామ పంచాయతీ పరిధిలోని చౌల తండా, జాల్ తండా, అర్లగడ్డ తండాల్లో ఉదయం 5 గంటల నుంచి 7 గంటల వరకు తనిఖీలు చేపట్టారు. తనిఖీల సందర్భంగా సుమారు 50 లీటర్ల అక్రమ సారా, 4 క్వింటాళ్ల బెల్లం, 50 కిలోల పట్టికను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే సారా తయారీ కోసం సిద్ధం చేసిన సుమారు 1000 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. అదేవిధంగా పత్రాలు సక్రమంగా లేని 10 ద్విచక్ర వాహనాలను సీజ్ చేసి స్వాధీనం చేసుకున్నారు. అక్రమ కార్యకలాపాల నియంత్రణ కోసం ఇలాంటి తనిఖీలు భవిష్యత్తులో మరింత విస్తృతంగా కొనసాగిస్తామని పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మరిపెడ సీఐ ఎల్. పవన్ కుమార్, ఎస్ఐ గంద్రాతి సతీష్, చిన్నగూడూరు ఎస్ఐ కుశ్ కుమార్‌తో పాటు సుమారు 25 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## లింగగిరి గ్రామం నుంచి ఎంబీబీఎస్ పూర్తి చేసిన తొలి యువకుడు జయంత్

**వేద న్యూస్, చెన్నరావుపేట :**




వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం లింగగిరి గ్రామానికి చెందిన మాదారపు జయంత్ ఎంబీబీఎస్ పూర్తి చేసి గ్రామానికి గర్వకారణంగా నిలిచాడు. లింగగిరి గ్రామం నుంచి ఎంబీబీఎస్ విద్యను పూర్తి చేసిన తొలి యువకుడిగా జయంత్ గుర్తింపు పొందడంతో గ్రామస్తులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలియజేశారు. నిరుపేద దళిత కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన జయంత్ తన ప్రాథమిక విద్యను పూర్తిగా ప్రభుత్వ పాఠశాలల్లో అభ్యసించాడు. 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు మడికొండలోని సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో చదివి, అనంతరం ఘనపూర్ సోషల్ వెల్ఫేర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేశాడు. తన కృషి, పట్టుదలతో హైదరాబాద్‌లోని గాంధీ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించి విజయవంతంగా కోర్సు పూర్తి చేశాడు. ప్రస్తుతం అదే గాంధీ మెడికల్ కళాశాలలో ఏడాది పాటు ఇంటర్న్‌షిప్ చేయనున్నాడు. జయంత్ తల్లిదండ్రులు మాదారపు రమేష్, స్వరూప. వీరికి ప్రశాంత్, శ్రీకాంత్, జయంత్ అనే ముగ్గురు కుమారులు ఉన్నారు. వారిలో చిన్నవాడైన జయంత్ చిన్ననాటి నుంచే చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ తన లక్ష్య సాధన కోసం నిరంతరం శ్రమించాడు. ఎంబీబీఎస్ చదువుతున్న సమయంలో అతని రెండో అన్న శ్రీకాంత్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం కుటుంబాన్ని తీవ్ర విషాదంలో ముంచెత్తింది. అయినప్పటికీ ఆ బాధను అధిగమించి, తన లక్ష్యాన్ని విడిచిపెట్టకుండా ముందుకు సాగి ఎంబీబీఎస్ పూర్తి చేయడం అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలిచింది. జయంత్ సాధించిన విజయంపై కుటుంబ సభ్యులు, వదిన మౌనిక, అన్న పిల్లలు అనిరుధ్, అప్పీ కుషాల్, మామయ్యలు, అత్తమ్మలు, పిన్ని, బాబాయిలతో పాటు గ్రామ పెద్దలు, స్నేహితులు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన ఒక సాధారణ కుటుంబం నుంచి వచ్చి వైద్య విద్యను పూర్తి చేసిన జయంత్ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నాడని గ్రామ పెద్దలు కొనియాడారు. కష్టపడి చదివితే ఏ లక్ష్యాన్నైనా సాధించవచ్చని జయంత్ నిరూపించాడని వారు పేర్కొన్నారు.

## వరద ముప్పు నివారణకు కాలువల్లో పూడిక తొలగింపు..!

**వేద న్యూస్ రామగుండం :**



యుద్ధ ప్రాతిపదికన కాలువల్లోని పూడిక తొలగించి వరద ముప్పు నివారించడానికి చర్యలు తీసుకుంటున్నామని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి తెలిపారు. వార్డు సందర్శన కార్యక్రమంలో భాగంగా శనివారం ఒకటవ డివిజన్‌లో డిప్యూటీ మేయర్ పాత పెల్లి ఎల్లయ్య, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థ), కమిషనర్ జె, అరుణ శ్రీతో కలిసి ఆయన పర్యటించారు.ఈ సందర్భంగా పి కె. రామయ్య కాలనీ సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించిన మేయర్ కాలువల్లో పూడికతీతకు ఆదేశించారు. జేసీబీ, బ్లేడ్ ట్రాక్టర్, చైన్ జేసీబీ, బాబ్ కార్ట్, జెట్టింగ్ యంత్రం, పారిశుద్ధ్య సిబ్బంది సహాయంతో కాలనీ వీధుల్లో పూడుక పోయిన ఉపరితల కాలువను పూర్తిగా శుభ్రం చేయించారు.

వేద న్యూస్

ఆదివారం మే 31 , 2026

# విక్రయాల కోసం భారీ తగ్గింపు.. టెస్లా మోడల్ వై ధరలో రూ.9 లక్షల కోత..!




**వేద న్యూస్ డెస్క్:**

ప్రపంచ ప్రఖ్యాత విద్యుత్ వాహన తయారీ సంస్థ టెస్లా భారత మార్కెట్లో తన మోడల్ వై కారుపై భారీ ధర తగ్గింపును ప్రకటించింది. దేశీయ మార్కెట్లో ఆశించిన స్థాయిలో విక్రయాలు జరగకపోవడంతో కంపెనీ ఏకంగా రూ.9 లక్షల మేర ధరను తగ్గిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయం భారత విద్యుత్ వాహన రంగంలో చర్చనీయాంశంగా మారింది.భారీ ధరల కారణంగా వినియోగదారులు ఇతర కంపెనీల విద్యుత్ వాహనాల వైపు మొగ్గు చూపుతున్న నేపథ్యంలో టెస్లా తన వ్యూహాన్ని మార్చుకుంది. కొత్త ధరలతో మోడల్ వై వాహనం మరింత మందికి అందుబాటులోకి రానుంది. అలాగే భారత మార్కెట్ అవసరాలకు అనుగుణంగా వాహనాల శ్రేణిలో కూడా మార్పులు చేస్తూ కొత్త వేరియంట్లను ప్రవేశపెట్టేందుకు సంస్థ సిద్ధమవుతోంది.ధరల తగ్గింపు వల్ల విద్యుత్ వాహనాల విభాగంలో పోటీ మరింత పెరిగే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా దేశీయ సంస్థలు మరియు ఇతర అంతర్జాతీయ బ్రాండ్లపై ఈ నిర్ణయం ప్రభావం చూపే అవకాశముంది. పెరుగుతున్న పోటీ కారణంగా వినియోగదారులకు మరిన్ని ప్రయోజనాలు లభించే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు.భారతదేశంలో విద్యుత్ వాహనాల వినియోగం క్రమంగా పెరుగుతున్న తరుణంలో టెస్లా ఈ నిర్ణయం తీసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. తక్కువ ధరలకు అత్యాధునిక సాంకేతికత కలిగిన వాహనాలను అందించడం ద్వారా మార్కెట్ వాటాను పెంచుకోవడమే కంపెనీ ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది.కొత్త ధరలు తక్షణమే అమల్లోకి వచ్చినట్లు సమాచారం. ఈ భారీ ధర తగ్గింపు తర్వాత టెస్లా విక్రయాలు ఎంత మేర పెరుగుతాయన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# జూన్ 1 నుంచి మారనున్న యూపీఐ, ఏటీఎం నిబంధనలు..




**వేద న్యూస్ డెస్క్:**

జూన్ నెల ప్రారంభం కానుండటంతో దేశవ్యాప్తంగా ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన పలు కీలక మార్పులు అమల్లోకి రానున్నాయి. ముఖ్యంగా యూపీఐ మరియు ఏటీఎం సేవలకు సంబంధించిన కొత్త నిబంధనలు వినియోగదారులపై ప్రత్యక్ష ప్రభావం చూపనున్నాయి. డిజిటల్ చెల్లింపులు, నగదు ఉపసంహరణలు చేసే వారు ఈ మార్పులపై ముందుగానే అవగాహన కలిగి ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.యూపీఐ లావాదేవీల్లో పారదర్శకత పెంచే లక్ష్యంతో కొత్త విధానం అమల్లోకి రానుంది. ఇకపై యూపీఐ ద్వారా డబ్బులు పంపే సమయంలో లబ్ధిదారుడి బ్యాంకు ఖాతాలో నమోదైన అసలు పేరు స్పష్టంగా కనిపించనుంది. క్యూఆర్ కోడ్ స్కాన్ చేసినా, మొబైల్ నంబర్ ద్వారా చెల్లింపు చేసినా బ్యాంకు రికార్డుల్లో ఉన్న పేరునే వినియోగదారులు చూడగలుగుతారు. ఈ మార్పుతో తప్పు ఖాతాలకు డబ్బులు పంపే ప్రమాదం తగ్గడంతో పాటు మోసాలకు అడ్డుకట్ట పడే అవకాశం ఉంది.మరోవైపు ఏటీఎం సేవల్లో కూడా కొన్ని మార్పులు అమల్లోకి రానున్నాయి. పలు బ్యాంకులు ఇతర బ్యాంకుల ఏటీఎంలలో ఉచిత లావాదేవీల పరిమితిని తగ్గించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం. నగదు ఉపసంహరణ, బ్యాలెన్స్ పరిశీలన, మినీ స్టేట్‌మెంట్ వంటి సేవలపై అదనపు చార్జీలు విధించే అవకాశం ఉంది. ముఖ్యంగా తరచూ ఇతర బ్యాంకుల ఏటీఎంలను వినియోగించే ఖాతాదారులు ఈ మార్పులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచిస్తున్నారు.ఆర్థిక లావాదేవీలను సురక్షితంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు ఈ కొత్త నిబంధనలను ముందుగానే తెలుసుకుని అవసరమైన జాగ్రత్తలు తీసుకోవడం మంచిదని బ్యాంకింగ్ నిపుణులు పేర్కొంటున్నారు.


# ముంబయిలో మళ్లీ గ్యాస్ ధరల షాక్




**వేద న్యూస్ డెస్క్:**

మహారాష్ట్ర రాజధాని ముంబయిలో సామాన్యులపై ఇంధన భారం మరింత పెరిగింది. ముంబయి, పరిసర ప్రాంతాల్లో కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్ ధరను కిలోగ్రాముకు రూ.2 మేర పెంచినట్లు గ్యాస్ పంపిణీ సంస్థ ప్రకటించింది. కేవలం 16 రోజుల వ్యవధిలో ధరలు పెరగడం ఇది రెండోసారి కావడం గమనార్హం. వాహనాల కోసం వినియోగించే గ్యాస్‌తో పాటు గృహ అవసరాలకు పైప్‌ల ద్వారా సరఫరా చేసే సహజ వాయువు ధరలను కూడా పెంచినట్లు సంస్థ వెల్లడించింది. తాజా సవరణతో ముంబయిలో గ్యాస్ ధర కిలోగ్రాముకు రూ.86కు చేరింది. గృహ వినియోగ గ్యాస్ ధర కూడా స్వల్పంగా పెరిగింది. ఈ తాజా పెంపుతో మే నెల మధ్య నుంచి ఇప్పటివరకు గ్యాస్ ధరలు మొత్తం రూ.4 మేర పెరిగినట్లయింది. దీంతో వాహనదారులు, గృహ వినియోగదారులపై అదనపు భారం పడనుంది. కేంద్ర ప్రభుత్వం నుంచి లభించే దేశీయ గ్యాస్ కేటాయింపులు తగ్గడం, బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలకు గ్యాస్ కొనుగోలు చేయాల్సి రావడం, అంతర్జాతీయంగా రూపాయి విలువ క్షీణించడం వంటి కారణాల వల్ల వ్యయం పెరిగిందని సంస్థ తెలిపింది. మరోవైపు దేశంలోని ఇతర ప్రాంతాల్లో కూడా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. పలు నగరాల్లో గ్యాస్ పంపిణీ సంస్థలు ఇప్పటికే ధరలను పెంచగా, మరికొన్ని సంస్థలు కూడా అదే దిశగా అడుగులు వేస్తున్నట్లు సమాచారం. అంతర్జాతీయ మార్కెట్‌లో కొనసాగుతున్న అనిశ్చిత పరిస్థితుల ప్రభావంతో గ్యాస్ ధరల్లో మరిన్ని మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. దీంతో వాహనదారులు, గృహిణుల నెలవారీ ఖర్చులు మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# ఆసియా క్రీడల ట్రయల్స్‌లో అదరగొట్టిన వినేశ్..



**వేద న్యూస్ డెస్క్:**

ఆసియా క్రీడల కోసం నిర్వహిస్తున్న ఎంపికల ట్రయల్స్‌లో ప్రముఖ రెజ్లర్ వినేశ్ పోగట్ శుభారంభం చేసింది. ప్రారంభ బౌట్‌లో జ్యోతిపై 7-1 స్కోరు తేడాతో విజయం సాధించి తన సత్తా చాటింది. మ్యాచ్ ఆరంభంలో కొంత జాగ్రత్తగా ఆడిన వినేశ్, ఆ తర్వాత దూకుడు పెంచి ప్రత్యర్థిపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. మొదటి పీరియడ్‌లో పుష్ పాయింట్‌తో ఖాతా తెరిచిన వినేశ్, అనంతరం డబుల్ లెగ్ అటాక్‌తో మరిన్ని పాయింట్లు సాధించింది. ప్రత్యర్థికి అవకాశమివ్వకుండా రక్షణాత్మకంగానూ, దూకుడుగానూ ఆడి ఆధిక్యంలో నిలిచింది. రెండో పీరియడ్‌లో వినేశ్ పూర్తిగా మ్యాచ్‌ను తన నియంత్రణలోకి తీసుకుంది. రైట్ లెగ్ అటాక్‌లతో వరుస పాయింట్లు సాధిస్తూ 3-0 ఆధిక్యం సంపాదించింది. జ్యోతి కూడా లెగ్ అటాక్‌కు ప్రయత్నించినప్పటికీ, ఆ పోరులో వినేశ్ పైచేయి సాధించింది. కౌంటర్ అటాక్‌లో వరుసగా రెండు వేగవంతమైన కదలికలతో స్కోరును 7-0కు చేర్చింది. చివర్లో జ్యోతి ఒక పుష్ ఔట్ పాయింట్ సాధించినప్పటికీ ఫలితాన్ని మార్చలేకపోయింది. ఈ విజయంతో వినేశ్ పోగట్ తదుపరి బౌట్‌లో నిషాతో తలపడనుంది. ట్రయల్స్‌లో పాల్గొనే అవకాశంపై గతంలో వివాదం నెలకొన్నప్పటికీ, న్యాయపరమైన పోరాటం అనంతరం అవకాశం దక్కించుకున్న వినేశ్ ఇప్పుడు తన ప్రదర్శనతో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఆసియా క్రీడల బెర్త్ కోసం ఆమె పోరాటం ఆసక్తికరంగా మారింది.

# ఫైనల్‌లోకి దూసుకెళ్లిన సాత్విక్-చిరాగ్



**వేద న్యూస్ డెస్క్:**

ప్రతిష్ఠాత్మక సింగపూర్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్‌చిరాగ్ శెట్టి అద్భుత ప్రదర్శనతో ఫైనల్‌కు చేరుకుంది. పురుషుల డబుల్స్ విభాగంలో వరుస విజయాలతో జోరు కొనసాగిస్తున్న ఈ భారత ద్వయం, శనివారం జరిగిన సెమీఫైనల్లో ప్రపంచ నంబర్ వన్ జోడీపై సంచలన విజయం సాధించి టైటిల్ పోరుకు అర్హత సాధించింది. ఈ విజయంతో భారత్‌కు కనీసం రజత పతకం ఖాయం కాగా, ఇప్పుడు స్వర్ణ పతకంపై ఆశలు మరింత పెరిగాయి. సెమీఫైనల్లో దక్షిణ కొరియాకు చెందిన ప్రపంచ అగ్రశ్రేణి జోడీ కిమ్ వాన్ హోసియో సెయుంగ్ జేతో తలపడిన సాత్విక్‌చిరాగ్ జంట మొదటి నుంచే దూకుడుగా ఆడింది. ఇరువైపులా హోరాహోరీ పోరు సాగినప్పటికీ కీలక సందర్భాల్లో మెరుగైన ఆటతీరును కనబరిచిన భారత జోడీ 21-19, 21-18 స్కోరుతో వరుస సెట్లలో విజయం సాధించింది. కేవలం 52 నిమిషాల్లోనే మ్యాచ్‌ను ముగించిన సాత్విక్‌చిరాగ్, ప్రపంచ నంబర్ వన్ జోడీపై తమ తొలి విజయాన్ని నమోదు చేసి మరో అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. ఈ టోర్నీలో ఇప్పటికే పలువురు భారత ఆటగాళ్లు నిష్క్రమించిన నేపథ్యంలో సాత్విక్‌చిరాగ్ జంట దేశ ఆశలను నిలబెట్టింది. మహిళల సింగిల్స్‌లో పీవీ సింధు, పురుషుల సింగిల్స్‌లో లక్ష్యసేన్ వంటి స్టార్ షట్లర్లు ముందుగానే టోర్నీ నుంచి నిష్క్రమించగా, భారత డబుల్స్ జోడీ మాత్రం అద్భుత పోరాటంతో ఫైనల్ వరకు చేరింది. వారి సమన్వయం, వేగం, నెట్ వద్ద చాకచక్యం ప్రత్యర్థులకు పెద్ద సవాలుగా మారింది. ఆదివారం జరిగే ఫైనల్లో ఇండోనేషియాకు చెందిన ఫజర్ అల్ఫియాన్‌ముహమ్మద్ షోహిబుల్ ఫిక్రీ జోడీ లేదా చైనాకు చెందిన లియాంగ్ వీ కెంగ్‌వాంగ్ ఛాంగ్ జోడీలలో ఒకదానితో సాత్విక్‌చిరాగ్ తలపడనుంది. గత కొంతకాలంగా అంతర్జాతీయ వేదికలపై నిలకడైన ప్రదర్శన చేస్తున్న ఈ భారత జంట, ఇప్పుడు సింగపూర్ ఓపెన్ టైటిల్‌ను గెలిచి మరో చారిత్రక విజయాన్ని ఖాతాలో వేసుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. భారత బ్యాడ్మింటన్ అభిమానులు కూడా ఈ టైటిల్ పోరుపై ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు

# వైభవ్ బ్యాటింగ్ అసాధారణం..



**వేద న్యూస్ డెస్క్:**

రాజస్థాన్ రాయల్స్ తరపున ఆడుతున్న యువ సంచలనం వైభవ్ సూర్యవంశీపై భారత బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్ ప్రశంసల వర్షం కురిపించాడు. చిన్న వయసులోనే వైభవ్ ప్రదర్శిస్తున్న ఆత్మవిశ్వాసం, భారీ షాట్లు ఆడే సామర్థ్యం అసాధారణమని కొనియాడాడు. వైభవ్ హిట్టింగ్ పవర్ గురించి మాట్లాడుతూ, ఎంతో అనుభవం ఉన్న సీనియర్ క్రికెటర్లు కూడా బంతిని అతడు కొట్టినంత సమర్థంగా బాదలేరని సర్ఫరాజ్ పేర్కొన్నాడు. క్రీజులో నిలబడి బంతిని టైమ్ చేసే తీరు, సరైన షాట్ల ఎంపిక అతడి ప్రత్యేకత అని అన్నాడు. అంత చిన్న వయసులోనే ఇంతటి పరిణతి ప్రదర్శించడం సాధారణ విషయం కాదని సర్ఫరాజ్ అభిప్రాయపడ్డాడు. ప్రతి మ్యాచ్‌లోనూ భయం లేకుండా దూకుడుగా ఆడుతూ జట్టుకు కీలక పరుగులు అందిస్తున్నాడని తెలిపాడు. ఐపీఎల్ వేలంలో భారీ ధరకు ఎంపికైనప్పటి నుంచే వైభవ్ సూర్యవంశీ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాడు. ప్రస్తుతం అతని ప్రదర్శనలు రాజస్థాన్ రాయల్స్‌కు కీలక బలంగా మారాయి. సర్ఫరాజ్ ఖాన్ వంటి ప్రముఖ ఆటగాడి నుంచి వచ్చిన ప్రశంసలు యువ బ్యాటర్‌కు మరింత ఉత్సాహాన్ని అందిస్తాయని క్రికెట్ విశ్లేషకులు భావిస్తున్నారు. భారత క్రికెట్‌కు వైభవ్ సూర్యవంశీ భవిష్యత్తులో కీలక ఆటగాడిగా ఎదిగే అవకాశాలు ఉన్నాయని, రాబోయే రోజుల్లో మరిన్ని రికార్డులు సృష్టించే సామర్థ్యం అతనిలో కనిపిస్తోందని అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# ఆసియా క్రీడల్లో వైభవ్‌కు ఛాన్స్.. సూర్య, గిల్‌కు షాక్..!



**వేద న్యూస్ డెస్క్:**

జపాన్‌లో జరగనున్న ఆసియా క్రీడల కోసం భారత క్రికెట్ నియంత్రణ మండలి 30 మంది ఆటగాళ్లతో కూడిన ప్రాథమిక జాబితాను సిద్ధం చేసింది. ఈ జాబితాలో ఐపీఎల్‌లో సంచలన ప్రదర్శనతో అందరి దృష్టిని ఆకర్షించిన యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీకి చోటు దక్కడం విశేషం. అయితే భారత టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, వన్డే జట్టు సారథి శుభ్‌మన్ గిల్ పేర్లు లేకపోవడం చర్చనీయాంశంగా మారింది.సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 4 వరకు జపాన్‌లోని ఐచీ-నగోయా వేదికగా ఆసియా క్రీడలు జరగనున్నాయి. ఇదే సమయంలో భారత్ స్వదేశంలో వెస్టిండీస్‌తో వన్డే, టీ20 సిరీస్ ఆడనుంది. రెండు కీలక టోర్నీలు ఒకేసారి జరుగుతుండటంతో బీసీసీఐ రెండు వేర్వేరు జట్లను సిద్ధం చేయాలని నిర్ణయించింది.ఐపీఎల్‌లో అద్భుత ప్రదర్శనతో వెలుగులోకి వచ్చిన వైభవ్ సూర్యవంశీకి ఈ టోర్నీ ద్వారా అంతర్జాతీయ వేదికపై తన ప్రతిభను నిరూపించుకునే అవకాశం లభించింది. యువ ఆటగాళ్లకు ప్రాధాన్యం ఇవ్వాలనే ఆలోచనతోనే అతడిని ప్రాబబుల్స్ జాబితాలో చేర్చినట్లు తెలుస్తోంది.సూర్యకుమార్ యాదవ్‌ను ఎంపిక చేయకపోవడానికి వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్ ప్రధాన కారణంగా తెలుస్తోంది. 2028 ఒలింపిక్స్, రాబోయే టీ20 ప్రపంచకప్‌లను దృష్టిలో పెట్టుకుని యువ ఆటగాళ్లను తీర్చిదిద్దే దిశగా సెలక్టర్లు అడుగులు వేస్తున్నారు. మరోవైపు వెస్టిండీస్‌తో జరిగే వన్డే సిరీస్‌కు శుభ్‌మన్ గిల్ నాయకత్వం వహించే అవకాశముండటంతో అతడిని ఆసియా క్రీడల జట్టుకు పరిగణలోకి తీసుకోలేదు.జట్టుకు కెప్టెన్‌గా ఎవరు వ్యవహరిస్తారన్న దానిపై ఇంకా స్పష్టత రాలేదు. శ్రేయస్ అయ్యర్, సంజు శాంసన్, తిలక్ వర్మ పేర్లు సారథ్య రేసులో వినిపిస్తున్నాయి. ఈ ముగ్గురిలో ఒకరికి జట్టు బాధ్యతలు అప్పగించే అవకాశం ఉందని సమాచారం.

వేద న్యూస్

ఆదివారం మే 31 , 2026

# మూడే సినిమాలు.. క్రేజ్ మాత్రం తగ్గలేదు..!

**వేద న్యూస్ డెస్క్:**



సినీ పరిశ్రమలో కొంతమంది నటీమణులు చేసిన సినిమాల కంటే సంపాదించుకున్న గుర్తింపుతోనే ఎక్కువకాలం ప్రేక్షకుల మనసుల్లో నిలిచిపోతారు. అలాంటి అరుదైన నటీమణుల్లో ప్రియా ప్రకాష్ వారియర్ ఒకరు. కేవలం కొన్ని చిత్రాల్లో మాత్రమే నటించినప్పటికీ, దేశవ్యాప్తంగా కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్న ఈ మలయాళ భామ ఇప్పటికీ సోషల్ మీడియా సంచలనంగానే కొనసాగుతోంది. ఒకే ఒక్క కన్నుకొట్టిన సన్నివేశంతో దేశవ్యాప్తంగా క్రేజ్ సంపాదించి, రాత్రికి రాత్రే స్టార్‌గా మారిన ప్రియా ప్రయాణం ఇప్పటికీ ఆసక్తికరంగానే కొనసాగుతోంది. మలయాళ చిత్రం లిఒరు అదార్ లవ్‌లి విడుదలకు ముందే అందులోని పాటలో కనిపించిన ప్రియా ప్రకాష్ వారియర్ హావభావాలు సోషల్ మీడియాలో తుఫాన్ సృష్టించాయి. ముఖ్యంగా ఆమె కన్నుకొట్టిన చిన్న సన్నివేశం ప్రపంచవ్యాప్తంగా వైరల్ కావడంతో ఒక్కసారిగా కోట్లాది మంది యువత దృష్టిని ఆకర్షించింది. ఆ వీడియో విడుదలైన కొన్ని గంటల్లోనే లక్షలాది వ్యూస్ సాధించగా, కొన్ని రోజుల్లోనే ఆమె పేరు దేశవ్యాప్తంగా ట్రెండింగ్‌గా మారింది. అప్పటివరకు తెలియని ఒక యువ నటి ఒక్కసారిగా జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం అరుదైన ఘటనగా నిలిచింది. ఈ సంచలన విజయంతో ప్రియాకు తెలుగు, హిందీ, తమిళ, కన్నడ భాషల నుంచి అవకాశాలు వరుసగా వచ్చాయి. నిర్మాతలు, దర్శకులు ఆమెను తమ చిత్రాల్లో నటింపజేయడానికి ఆసక్తి చూపారు. అయితే భారీ అంచనాల మధ్య వచ్చిన అవకాశాలు ఆమెకు ఆశించిన స్థాయిలో విజయాలను అందించలేకపోయాయి. ముఖ్యంగా తెలుగులో నటించిన కొన్ని చిత్రాలు బాక్సాఫీస్ వద్ద నిరాశపరిచాయి. కథల ఎంపికలో తీసుకున్న నిర్ణయాలు, ప్రేక్షకుల అభిరుచులకు అనుగుణంగా సినిమాలు లేకపోవడం వంటి కారణాలతో స్టార్ హీరోయిన్ స్థాయికి చేరుకునే అవకాశాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకోలేకపోయింది. అయితే సినిమాల్లో ఆశించిన విజయాలు రాకపోయినా, ప్రియా ప్రజాదరణ మాత్రం ఏమాత్రం తగ్గలేదు. ముఖ్యంగా సామాజిక మాధ్యమాల్లో ఆమెకు ఉన్న అభిమాన గణం ఇప్పటికీ భారీగానే ఉంది. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి వేదికల్లో ఆమె పంచుకునే ప్రతి ఫొటో, వీడియో నిమిషాల్లోనే వైరల్ అవుతుంటాయి. గ్లామర్ ఫొటోషూట్లు, ట్రెండీ ఫ్యాషన్ స్టైల్, అందమైన చిరునవ్వుతో అభిమానులను ఆకట్టుకుంటూ ఎప్పటికప్పుడు వార్తల్లో నిలుస్తోంది. ప్రియా ప్రకాష్ వారియర్ ప్రత్యేకత కేవలం అందంలోనే కాదు. తన సహజమైన నటన, కెమెరా ముందు ఆత్మవిశ్వాసంతో కనిపించే తీరు కూడా ఆమెకు ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చాయి. మోడలింగ్ రంగంలోనూ ఆమెకు మంచి డిమాండ్ ఉంది. పలు ప్రముఖ బ్రాండ్లకు ప్రచారకర్తగా వ్యవహరిస్తూ వాణిజ్య ప్రకటనల్లోనూ కనిపిస్తోంది. దీంతో సినిమాల కంటే ఎక్కువగా డిజిటల్ ప్రపంచంలోనే ఆమె ప్రభావం కనిపిస్తోంది. ప్రస్తుతం ప్రియా పలు కొత్త ప్రాజెక్టులపై దృష్టి సారించినట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. మంచి కథలు, బలమైన పాత్రల కోసం ఎదురుచూస్తున్న ఆమె, తన కెరీర్‌లో మరోసారి బలమైన మలుపు తిప్పాలని ప్రయత్నిస్తోంది. గతంలో వచ్చిన క్రేజ్‌ను నిలబెట్టుకోవడం ఎంత కష్టమో తెలిసినా, తన అభిమానులతో నిరంతరం అనుసంధానమై ఉండటం ద్వారా ఆమె ప్రత్యేక స్థానాన్ని కాపాడుకుంటోంది. సినిమాల సంఖ్య తక్కువైనా, ప్రజాదరణ మాత్రం అసాధారణంగా ఉండటం ప్రియా ప్రకాష్ వారియర్ ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు. ఒకప్పుడు కన్నుకొట్టిన వీడియోతో దేశాన్ని ఆకట్టుకున్న ఈ అందాల తార, ఇప్పటికీ సోషల్ మీడియాలో తనదైన మాయాజాలంతో అభిమానులను అలరిస్తూనే ఉంది. తాజాగా ఆమె పంచుకున్న గ్లామర్ చిత్రాలు మరోసారి వైరల్ కావడంతో, ప్రియా పేరు మళ్లీ నెట్టింట హాట్ టాపిక్‌గా మారింది. అభిమానుల ప్రేమ, ఆదరణ కొనసాగుతున్నంత కాలం ఆమె క్రేజ్ తగ్గే అవకాశమే లేదని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# 'రోమాంచకం'తో సందీప్ కొత్త ప్రయాణం




**వేద న్యూస్ డెస్క్:**

'అర్జున్ రెడ్డి', 'యానిమల్' చిత్రాలతో సంచలన విజయాలు అందుకున్న దర్శకుడు సందీప్ రెడ్డి వంగా ఇప్పుడు కొత్త బాధ్యతలో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. యువ నటులు సుమంత్ ప్రభాస్, అనంతిక సనిల్‌కుమార్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న 'రోమాంచకం' చిత్రానికి ఆయన సమర్పకుడిగా వ్యవహరిస్తున్నారు. ఈ సందర్భంగా చిత్రానికి సంబంధించిన తొలి పోస్టర్‌ను సందీప్ రెడ్డి వంగా సామాజిక మాధ్యమాల ద్వారా విడుదల చేశారు. అలాగే సినిమాపై తన అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తూ భావోద్వేగభరిత సందేశాన్ని కూడా పంచుకున్నారు. చిత్ర పరిశ్రమలో పంపిణీదారుడిగా ఇది తన తొలి ప్రాజెక్ట్ అని వెల్లడించారు. కథ వింటున్న సమయంలో తాను ఎంతగానో నవ్వుకున్నానని, అయితే ఆ వినోదం వెనుక బలమైన భావోద్వేగం కూడా దాగి ఉందని పేర్కొన్నారు. భద్రకాళి పిక్చర్స్ పతాకంపై రూపొందుతున్న ఈ చిత్రం సంగీత ప్రధాన ప్రేమకథా హాస్య చిత్రంగా ప్రేక్షకుల ముందుకు రాబోతోందని తెలిపారు. మరోవైపు సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో ప్రభాస్ నటిస్తున్న భారీ చిత్రం 'స్పిరిట్'పై కూడా భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రాన్ని 2027 మార్చి 5న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. ఇటీవల విడుదలైన ప్రచార దృశ్యాల్లో ప్రభాస్ కొత్త రూపంలో కనిపించడంతో అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. పొడవాటి జుట్టు, గడ్డం, తీవ్రమైన రూపంతో కనిపించిన ప్రభాస్ పాత్రపై చర్చ సాగుతోంది. ఈ చిత్రంలో తృప్తి దిమ్రి కథానాయికగా నటిస్తుండగా, వివేక్ ఒబెరాయ్ ప్రతినాయకుడి పాత్రలో కనిపించనున్నారు. భారీ నిర్మాణ విలువలతో తెరకెక్కుతున్న ఈ చిత్రం విడుదలకు ముందే సినీ వర్గాల్లో ప్రత్యేక ఆసక్తిని రేకెత్తిస్తోంది.

# 'కరుప్పు' రూ.300 కోట్ల ఘనత




**వేద న్యూస్ డెస్క్:**

తమిళ స్టార్ హీరో సూర్య నటించిన భారీ చిత్రం లిలి'కరుప్పు'లిలి బాక్సాఫీస్ వద్ద తన విజయ ప్రస్థానాన్ని అప్రతిహతంగా కొనసాగిస్తోంది. విడుదలైన తొలి రోజు నుంచే ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్న ఈ చిత్రం తాజాగా ప్రపంచవ్యాప్తంగా లిలిరూ.300 కోట్ల గ్రాస్ వసూళ్ల మైలురాయిని అధిగమించిలిలి మరో అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. ఆధ్యాత్మికత, భావోద్వేగాలు, యాక్షన్, వాణిజ్య హంగులను సమపాళ్లలో మేళవించిన ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకుల నుంచి అద్భుతమైన ఆదరణను అందుకుంటూ సూర్య కెరీర్‌లో మరో మైలురాయిగా నిలిచింది. దర్శకుడు ఆర్జే బాలాజీలిలి తెరకెక్కించిన ఈ చిత్రం విడుదలకు ముందే భారీ అంచనాలు నెలకొల్పింది. అయితే విడుదల అనంతరం ఆ అంచనాలను మించి ప్రేక్షకుల హృదయాలను గెలుచుకోవడంతో పాటు విమర్శకుల ప్రశంసలను కూడా అందుకుంది. ముఖ్యంగా కథలోని ఆధ్యాత్మిక నేపథ్యం, కుటుంబ బంధాలు, సామాజిక సందేశం, ఉత్కంఠభరిత కథనం ప్రేక్షకులను పూర్తిగా ఆకట్టుకున్నాయి. సినిమా ప్రారంభం నుంచి ముగింపు వరకు ఆసక్తిని కొనసాగించేలా దర్శకుడు కథను మలిచిన తీరు సినీ విశ్లేషకుల ప్రశంసలు అందుకుంటోంది. ఈ చిత్ర విజయానికి ప్రధాన బలంగా నిలిచింది సూర్య నటన. భావోద్వేగభరిత సన్నివేశాల్లో తన అనుభవాన్ని మరోసారి నిరూపించిన ఆయన, యాక్షన్ ఘట్టాల్లోనూ తనదైన శైలిలో మెప్పించారు. ముఖ్యంగా క్లైమాక్స్‌లో వచ్చే కీలక సన్నివేశాలు ప్రేక్షకులను భావోద్వేగానికి గురిచేస్తున్నాయని సినీ అభిమానులు చెబుతున్నారు. సూర్య పాత్రలో కనిపించిన లోతు, పరిణతి, నటనలోని సహజత్వం ఈ విజయానికి ప్రధాన కారణాల్లో ఒకటిగా నిలిచాయి. చిత్రంలోని భారీ విజువల్స్, ఆధ్యాత్మిక నేపథ్యాన్ని ప్రతిబింబించే అద్భుతమైన దృశ్యాలు ప్రేక్షకులను మరో ప్రపంచంలోకి తీసుకెళ్లినట్లుగా ఉన్నాయని ప్రేక్షకులు అభిప్రాయ పడుతున్నారు. ఛాయాగ్రాహకుడు జి.కె. విష్ణులిలి అందించిన అద్భుతమైన ఫ్రేములు సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆలయాలు, పర్వత ప్రాంతాలు, ఆధ్యాత్మిక కేంద్రాలను తెరపై అద్భుతంగా ఆవిష్కరించిన తీరు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తోంది. ఇక సంగీత దర్శకుడు లిలిసాయి అభ్యంకర్‌లిలి అందించిన పాటలు, నేపథ్య సంగీతం సినిమాకు మరో ప్రధాన బలంగా నిలిచాయి. విడుదలకు ముందే సంగీతం మంచి ఆదరణ పొందగా, సినిమా విడుదలైన తర్వాత నేపథ్య సంగీతం కథనానికి మరింత బలం చేకూర్చిందని ప్రేక్షకులు ప్రశంసిస్తున్నారు. ముఖ్యంగా భావోద్వేగ సన్నివేశాల్లో సంగీతం ప్రేక్షకుల మనసులను హత్తుకుంటోంది. విడుదలై రెండు వారాలు పూర్తయినప్పటికీ 'కరుప్పు' వసూళ్ల జోరు ఏమాత్రం తగ్గలేదు. సాధారణంగా భారీ చిత్రాలు తొలి వారాంతం తర్వాత నెమ్మదించినా, ఈ చిత్రం మాత్రం వారమధ్య రోజులలో కూడా గణనీయమైన వసూళ్లను నమోదు చేస్తూ ముందుకు సాగుతోంది. తమిళనాడుతో పాటు తెలుగు రాష్ట్రాలు, కర్ణాటక, కేరళ, ఉత్తర భారతదేశంలోని పలు ప్రాంతాల్లోనూ ఈ చిత్రం విజయవంతంగా ప్రదర్శితమవుతోంది.

# 'పెద్ది' చిత్రానికి తెలంగాణలో షాక్

**వేద న్యూస్ డెస్క్:**




పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న భారీ క్రీడా నేపథ్య చిత్రం 'పెద్ది'కి తెలంగాణలో ఊహించని ఎదురుదెబ్బ తగిలినట్లు తెలుస్తోంది. చిత్రం విడుదల సందర్భంగా మొదటి వారం రోజుల పాటు టికెట్ ధరలను పెంచుకునేందుకు అనుమతి ఇవ్వాలని చిత్ర నిర్మాణ సంస్థ చేసిన ప్రయత్నాలకు ఆశించిన ఫలితం దక్కలేదు. సమాచారం ప్రకారం, టికెట్ ధరల పెంపునకు అనుమతి కోరుతూ చిత్ర నిర్మాణ సంస్థ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించింది. అయితే ఈ అంశంలో తక్షణ జోక్యం చేసుకోలేమని, అత్యవసర ఉత్తర్వులు జారీ చేయలేమని న్యాయస్థానం స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. అంతకుముందు టికెట్ ధరల పెంపునకు అనుమతి కోరుతూ సంబంధిత అధికారులకు చిత్రబృందం పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినట్లు సమాచారం. అయితే ప్రభుత్వం నుంచి స్పష్టమైన స్పందన రాకపోవడంతో న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్లు తెలుస్తోంది. కోర్టు తదుపరి విచారణను జూన్ 6కు వాయిదా వేయడంతో, చిత్రం జూన్ 4న విడుదల అవుతున్న నేపథ్యంలో ఆ విచారణ వల్ల ప్రయోజనం ఉండదని భావించిన చిత్ర నిర్మాణ సంస్థ తమ పిటిషన్‌ను ఉపసంహరించుకున్నట్లు సమాచారం. దీంతో న్యాయస్థానం ఆ పిటిషన్‌ను కొట్టివేసినట్లు తెలుస్తోంది. మరోవైపు ఆంధ్రప్రదేశ్‌లో ఈ చిత్రానికి ప్రత్యేక ప్రదర్శనలతో పాటు టికెట్ ధరల పెంపునకు అనుమతులు లభించినట్లు సమాచారం. అయితే తెలంగాణలో మాత్రం సాధారణ ధరలతోనే చిత్రం ప్రదర్శించాల్సిన పరిస్థితి ఏర్పడటంతో ఈ విషయం సినీ, వ్యాపార వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# అందంతో ఆకట్టుకుంటున్న జియా శంకర్

**వేద న్యూస్ డెస్క్:**



టెలివిజన్, సినిమాలు, వెబ్ సిరీస్‌లలో తనదైన గుర్తింపు సంపాదించుకున్న నటి జియా శంకర్ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. అందం, ఫ్యాషన్ అభిరుచి, సహజమైన నటనతో ఆమెకు ప్రత్యేక అభిమాన వర్గం ఏర్పడింది. తెలుగు చిత్రంతో తన నటనా ప్రయాణాన్ని ప్రారంభించిన జియా శంకర్, ఆ తర్వాత తమిళం, మరాఠీ భాషల చిత్రాల్లోనూ నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. వివిధ భాషల్లో విభిన్న పాత్రలు పోషిస్తూ నటిగా తన ప్రతిభను చాటుకున్నారు. హిందీ టెలివిజన్ రంగంలో కూడా ఆమె విజయవంతమైన ప్రస్థానం కొనసాగింది. పలు ప్రముఖ ధారావాహికల్లో నటించి ప్రేక్షకులకు మరింత చేరువయ్యారు. తన సహజ నటనతో చిన్న తెరపై ప్రత్యేక గుర్తింపు సంపాదించారు. ప్రముఖ వినోద కార్యక్రమంలో పాల్గొన్న తర్వాత ఆమెకు దేశవ్యాప్తంగా మరింత గుర్తింపు లభించింది. ఆ కార్యక్రమంలో ఆమె ప్రవర్తన, నిజాయితీ, ఆత్మవిశ్వాసం ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. నటనతో పాటు జియా శంకర్ ఫ్యాషన్ ప్రపంచంలో కూడా ప్రత్యేక స్థానం సంపాదించారు. సంప్రదాయ దుస్తులు, ఆధునిక వస్త్రధారణ రెండింటిలోనూ ఆమె తనదైన శైలిని ప్రదర్శిస్తూ అభిమానులను ఆకర్షిస్తున్నారు. ముఖ్యంగా చీరలు, లెహంగాల్లో ఆమె కనిపించే తీరు సామాజిక మాధ్యమాల్లో తరచూ చర్చనీయాంశంగా మారుతోంది. సంప్రదాయం, ఆధునికత కలయికతో కూడిన ఆమె శైలి యువతకు ఆదర్శంగా నిలుస్తోంది.

# ఓటీటీలో ఈ వీకెండ్ వినోదాల జాతర



**వేద న్యూస్ డెస్క్:**

ఈ వారాంతం ఓటీటీ ప్రేక్షకులకు వినోదాల పండుగగా మారింది. తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీతో పాటు అంతర్జాతీయ భాషలకు చెందిన పలు సినిమాలు, వెబ్ సిరీస్‌లు ప్రముఖ డిజిటల్ వేదికల్లో అందుబాటులోకి వచ్చాయి. యాక్షన్, ప్రేమకథ, హాస్యం, ఉత్కంఠ, క్రీడా కథనాలు, డాక్యుమెంటరీలు ఇలా అన్ని రకాల వినోదాలను ప్రేక్షకులు ఆస్వాదించేందుకు అవకాశం లభిస్తోంది. అమెజాన్ ప్రైమ్ వీడియోలో 'లీడర్', 'భీమసేరి', 'పైసావాలా', 'నవాబ్స్ కేఫ్', 'సుఖమనో సుఖమను', 'సీట్ ఎడ్జ్' చిత్రాలు అందుబాటులోకి వచ్చాయి. అలాగే 'స్పైడర్ నోయిర్' వెబ్ సిరీస్‌తో పాటు పలు అంతర్జాతీయ చిత్రాలు కూడా ప్రేక్షకులను అలరించనున్నాయి. నెట్‌ఫ్లిక్స్‌లో ధనుష్ నటించిన 'కర' చిత్రం ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది. అలాగే పలు అంతర్జాతీయ చిత్రాలు, వెబ్ సిరీస్‌లు, క్రీడా డాక్యుమెంటరీలు కూడా స్ట్రీమింగ్‌కు వచ్చాయి. జియోహాట్‌స్టార్‌లో 'జెట్ లీ', 'బ్రదర్స్ అండ్ సిస్టర్స్', 'కజిన్స్ అండ్ కల్యాణమ్స్' వంటి చిత్రాలు, సిరీస్‌లు ప్రేక్షకులకు అందుబాటులో ఉన్నాయి. మాక్స్‌లో 'ఎస్పీపీ' చిత్రం స్ట్రీమింగ్ అవుతున్నాయి.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073